విలేకరులు కావలెను

TELANGANA VANI TELUGU DAILY R N I No. APTEL/2012/53127 తెలంగాణ వాణి

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును

9703247143



TELANGANA VANI TELUGU DAILY

R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక



తెలంగాణ వాణి

20వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

తెలంగాణ వాణి కుటుంబ సభ్యులకు 20వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

తెలంగాణ వాణి పాత్రికేయ కుటుంబ సభ్యులు, పాఠకులు, ప్రకటనకర్తలు, ప్రజా ప్రతినిధులు, అధికారులకు శుభాకాంక్షలు



ఎడిటర్
జేరిపోతుల సంపత్
9912758107



సంపుటి: 16 | సంచిక : 82 | శుక్రవారం 17. 7. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00


## ఏడు కీలక ప్రాజెక్టులకు ఆమోదం

- రూ.2.19 లక్షల కోట్లకు కేంద్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్
- సెమీకండక్టర్లు, మొబైల్ తయారీ, వారణాసి అభివృద్ధికి భారీ ఊతం
- ఎరువుల స్వయం సమృద్ధి.. రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణకు నిర్ణయాలు

2



## స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో గ్యాస్ సిలిండర్‌లు

- 10 నిమిషాల్లోనే ఇంటికి..
- హెచ్‌పీసీఎల్ వినూత్న సేవ
- దేశంలో తొలిసారిగా బెంగళూరులో ప్రారంభం

10 కేజీల నవ్య సిలిండర్లకు క్విక్ డెలివరీ





# సీతారామ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేస్తాం

- తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- అశ్వాపురం మండలంలో సీతారామ సాగర్ ప్రాజెక్ట్ పనులను మంత్రులతో కలిసి పరిశీలించిన
- "గోదావరి జలాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు సీతారామ ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహిస్తాం.
- గోదావరిపై చివరి ప్రాజెక్ట్ ఇది. దీనిపై ఆర్థిక భారం పడింది.
- కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దుర్మార్గంగా ఆలోచించి బడ్జెట్ పెంచి ప్రాజెక్టును రీడిజైన్ చేశారు.
- గోదావరిపై జరుగుతున్న అక్రమాలపై ఆనాడు శాసనసభలో, బయట కూడా గళం విప్పాం.
- పెద్ద ఎత్తున ఖర్చు చేసిన ఈ ప్రాజెక్టును పూర్తిచేయాలని సీఎం రేవంత్ పట్టుదలతో ఉన్నారు.
- ఇప్పటివరకు ఎంతమేర పనులు పూర్తయ్యాయో చూసేందుకు ఈ పర్యటన చేపట్టాం.
- ప్రజా ప్రభుత్వంలో ఒక్క పైసా కూడా దుర్వినియోగం కాకుండా ప్రాజెక్టును పూర్తిచేస్తాం'
- మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్ తెలంగాణ వాణి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సీతారామ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేస్తామని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అశ్వాపురం మండలంలో సీతారామ సాగర్ ప్రాజెక్ట్ పనులను మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అధికారులతో కలిసి భట్టి విక్రమార్క పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు."గోదావరి జలాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు సీతారామ ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహిస్తాం. గోదావరిపై చివరి ప్రాజెక్ట్ ఇది. దీనిపై ఆర్థిక భారం పడింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దుర్మార్గంగా ఆలోచించి బడ్జెట్ పెంచి ప్రాజెక్టును రీడిజైన్ చేశారు. గోదావరిపై జరుగుతున్న అక్రమాలపై ఆనాడు శాసనసభలో, బయట కూడా గళం విప్పాం. పెద్ద ఎత్తున ఖర్చు చేసిన ఈ ప్రాజెక్టును పూర్తిచేయాలని సీఎం రేవంత్ పట్టుదలతో ఉన్నారు. ఇప్పటివరకు ఎంతమేర పనులు పూర్తయ్యాయో చూసేందుకు ఈ పర్యటన చేపట్టాం

## బీజేపీ అధికారంలోకి వచ్చాక హిందూ విద్యార్థులందరికీ బొట్టు తప్పనిసరి చేస్తాం

- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్
- సక్సెస్ ప్రైవేట్ స్కూల్‌లో హిందూ విద్యార్థులకు కల్మా, సురా ఫతేహా చదవాలంటూ హోంవర్క్ ఇచ్చారన్నవివాదం
- బరితెగించి బలవంతంగా హిందూ సంస్కృతిపై దాడి చేస్తున్నారు.
- సక్సెస్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి
- ఈ ఘటనను సమాజమంతా ముక్తకంఠంతో ఖండించాలి



# పాలాభిషేకాలు, గజమాలలు వద్దు.

## తెలంగాణ ఇన్ చార్జ్ మీనాక్షి నటరాజన్

హైదరాబాద్ తెలంగాణ వాణి)

కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో నాయకులకు పాలాభిషేకాలు, నీళ్ల అభిషేకాలు చేయవద్దని ఆ పార్టీ తెలంగాణ ఇన్ చార్జ్ మీనాక్షి నటరాజన్ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన ఎలాంటి కార్యక్రమం అయినా ఇవి చేయకూడదని స్పష్టం చేశారు. ఎవరైనా పార్టీ ఆదేశాలను ఉల్లంఘిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆహారాన్ని వృథా చేయడం కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకం అని పేర్కొన్నారు. కావాలంటే పోషకాహారలోపంతో బాధపడుతున్న వారికి ఆ ఆహారాన్ని ధానం చేయాలని సూచించారు. పార్టీ సీనియర్ నాయకులు వచ్చినప్పుడు కొందరు నాయకులు జేసీబీలు, బుల్డోజర్లతో భారీ గజమాలలు వేస్తున్నారని ఈ వాహనాలు అణచివేతనకు చిహ్నాలు అని పేర్కొన్నారు. కాబట్టి ఇప్పటి నుండి ఎవరైనా జేసీబీలు, బుల్డోజర్లతో భారీ గజమాలలను నాయకులకు వేస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు.



## కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్లే విద్యుత్ కోతలు

- మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు
- పీపీటీలు పెట్టి హెచ్చరించినా మేల్కోలేదు:
- విద్యుత్ కోతలను నిరసిస్తూ ఈరోజు రాష్ట్రంలోని 11 జిల్లాల్లో సబ్‌స్టేషన్ల ముందు రైతాంగం ధర్నాలు
- థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు అందుబాటులో లేకపోవడం వల్లే కరెంట్ కోతలు
- సింగరేణి బొగ్గు నిల్వలపై తాము ముందే పీపీటీలు పెట్టి హెచ్చరించినా ప్రభుత్వం నిద్రలేదు
- అడ్డగోలు ధరలకు ఎందుకు కొంటున్నారు?:
- సింగరేణి వెబ్‌సైట్ మూసివేసి ఉత్పత్తి:
- సింగరేణి బొగ్గు నాణ్యత వివరాలు బయటకు రాకుండా కుట్ర
- నాణ్యమైన సింగరేణి బొగ్గును తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌కు పంపుతున్నారు.
- 70 రేకులు పంపితే 30 రేకులు రిజెక్ట్ అవుతున్నాయి.





## అమ్మవారికి బంగారు బోనం సమర్పణ

తెలంగాణ సంస్కృతిని, సంప్రదాయాన్ని ప్రతిబింబించే ఆషాఢ మాస బోనాలు గోల్కొండ కోటలో ప్రారంభం అయ్యాయి. జగదాంబిక మహంకాళి అమ్మవారికి కుమ్మరులు తొలి బోనం సమర్పించి ఈ ఉత్సవాలను ప్రారంభించారు. లంగర్‌హౌస్ నుంచి పోతురాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాల మధ్య ప్రభుత్వం తరఫున మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ.. బంగారు బోనం, పట్టువస్త్రాలను సమర్పించారు. బోనాలతో గోల్కొండ పరిసరాలు భక్తజనసందోహంగా మారాయి.

## సర్ నమోదు గడువు పెంపు

- ఆగస్టు 3 వరకు అవకాశం
- ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ విడుదల
- అక్టోబర్ 12న తుది ఓటర్ల జాబితా

2




# మాతా శిశు ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం క్షమించరానిది

- రేవంత్ రెడ్డి చేతగాని పాలన వల్లే ప్రభుత్వ వైద్యం నిర్వీర్యం
- మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి ఆగ్రహం

కొత్తగూడెం, జూలై 16 (తెలంగాణ వాణి)

కొత్తగూడెం పట్టణంలోని మాతా శిశు సంరక్షణ ఆసుపత్రిలో నిండు గర్భిణీ నిలబడి డెలివరీ కావడం అత్యంత బాధాకరమని, మనసును తీవ్రంగా కలచివేసిందని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. గురువారం భారాస ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి ఆమె ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాధిత గర్భిణీని పరామర్శించి, శిశువు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రిలోని రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దమ్మపేట నుంచి పేద మహిళలు నమ్ముకుని వస్తే కనీసం స్పందించే నాథుడు లేడన్నారు. నొప్పులతో బాధపడుతున్న గర్భిణీకి సరైన ట్రీట్‌మెంట్ ఇవ్వకుండా ఒక ఇంజెక్షన్ ఇచ్చి 6 గంటల తర్వాత డెలివరీ అవుతుందని నిర్లక్ష్యంగా చెప్పారని ఆరోపించారు. క్షణాల వ్యవధిలో ప్రసవమయ్యే అవకాశం ఉన్నా మహిళా రోగుల పట్ల ఇంత అమానుషంగా ప్రవర్తించడం సరికాదన్నారు. దేవుడి దయతో పాప ప్రాణాలతో బయటపడిందని, లేకుంటే ఆ కుటుంబానికి జరిగే నష్టానికి బాధ్యులెవరని ప్రశ్నించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా, హరీష్ రావు వైద్య శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారని, మందుల కొరత లేకుండా చూశారని తెలిపారు. కానీ నేడు రేవంత్ రెడ్డి చేతగాని పాలన వల్ల ఆసుపత్రుల్లో కనీసం మందులు లేవని, స్కానింగ్ డాక్టర్లు అందుబాటులో లేరని, డయాలసిస్ రోగులు అల్లాడుతున్నారని విమర్శించారు. తాము ఆసుపత్రికి వెళ్లగానే మహిళలు చుట్టూ చేరి గతంలో ఉన్న సౌకర్యాలు ఇప్పుడు లేవని, మందులు కూడా బయట కొనుక్కోవాల్సి వస్తోందని కన్నీరు పెట్టుకున్నారని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వంలో పిల్లల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను సైతం ఈ ప్రభుత్వం పాడుబెట్టిందని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పేద ప్రజలకు సక్రమంగా వైద్యం అందేలా చూడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భారాస తరఫున పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల ప్రాణాలంటే లెక్కలేదని, రానున్న రోజుల్లో మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో భారాస ప్రభుత్వం వచ్చి పేద ప్రజలకు న్యాయం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భారాస ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నేడు తెలంగాణ మంత్రివర్గ అత్యవసర భేటీ

హైదరాబాద్ తెలంగాణ వాణి)

సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్గం నేడు అత్యవసరంగా సమావేశం కానుంది. మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయంలోని 6వ అంతస్తులో కేబినెట్ మీటింగ్ హాల్‌లో ఈ భేటీ జగనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, కేబినెట్ భేటీ నేపథ్యంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, ప్రభుత్వ కార్యదర్శులందరూ తప్పనిసరిగా హెడ్‌క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని సీఎస్ ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రధానంగా సాగునీటి ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి, మూసీ పునరుజ్జీవనం ఫేజ్-1పనులు, వర్షాభావ పరిస్థితులు, అలాగే కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన పలు అభివృద్ధి ప్రాజెక్టులపై ప్రధానంగా చర్చించి కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లుగా తెలుస్తోంది. ఇక రాష్ట్రంపై 'ఎల్‌నినో' ప్రభావం, లోటు వర్షపాతం నమోదు, రైతులకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై కేబినెట్ దృష్టి పెట్టే అవకాశం ఉంది.

# సంపాదకీయం

## మత్తులో మునిగిపోతున్న భావి భారత యువత

భారతదేశ భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలవాల్సిన యువశక్తి నేడు మాదకద్రవ్యాల మహమ్మారిలో చిక్కుకుని విలవిల్లాడుతోంది. ఒకప్పుడు కేవలం సంపన్న వర్గాలకు, మహా నగరాలకు మాత్రమే పరిమితమని భావించిన డ్రగ్స్ సంస్కృతి ఇప్పుడు గ్రామాలు, పట్టణాలు, పాఠశాలలు, కళాశాలలు అనే తేడా లేకుండా విస్తరిం చింది. దేశ అభివృద్ధికి శక్తిగా మారాల్సిన యువత లో ఒక వర్గం మత్తుకు బానిసై కుటుంబాలను, సమాజాన్ని, దేశ భవిష్యత్తునే ప్రమాదంలోకి నెడు తోంది. ఇది కేవలం ఆరోగ్య సమస్య కాదు; సామాజిక, ఆర్థిక, నైతిక సంక్షోభం. స్నేహితుల ప్రలోభాలు, ఆధునిక జీవనశైలి, మానసిక ఒత్తిడి, త్వరగా ఆనందాన్ని పొందాలనే తప్పుడు భావన కారణంగా చాలామంది యువ కులు మొదటిసారి డ్రగ్స్కు చేరువవు తున్నారు. సరదాగా మొదలైన అలవాటు క్రమంగా వ్యసనం గా మారి జీవితాన్ని శాశ్వతంగా నాశనం చేస్తోంది. వ్యసనాన్ని కొనసాగించేందుకు కుటుంబాల్లో దొంగతనాలు చేయడం, దోపిడీలు, దాడులు, హత్యలు వంటి నేరాలకు పాల్పడడం నేడు సాధా రణ వార్తగా మారడం ఆందోళన కలిగిస్తోంది. మత్తు వ్యక్తిని మాత్రమే కాదు, అతడిపై ఆధారపడిన కుటుంబాన్ని, సమాజంలోని శాంతి భద్రతలను కూడా కుదేలు చేస్తోంది. చట్ట అమలు సంస్థలు అప్రమత్తంగా ఉన్న ప్పటికీ డ్రగ్స్ మాఫియా అత్యాధునిక సాంకేతి కత ను ఉపయోగించి కొత్త మార్గాలను వెతుక్కుం టోంది. ఈ-కామర్స్ వేదికలు, కొరియర్ సేవలు, బైక్, టాక్సీ డెలివరీ వ్యవస్థలను వినియోగించి మత్తు పదార్థాలను వినియోగదారుల గుమ్మం వరకు చేర్చడం అత్యంత ప్రమాదకర పరిణామం. విదేశాల నుంచి కొరియర్ పార్సిళ్ల రూపంలో డ్రగ్స్ రావడం, దేశీయంగా రహస్య ల్యాబ్లలో సింథటిక్ డ్రగ్స్ తయారవుతున్నట్లు తరచూ వెలుగు చూసున్న కేసులు ఈ ముఠాల విస్తృత నెట్వర్సు స్పష్టం చేస్తున్నాయి. గత ఐదేళ్లలో దేశవ్యాప్తంగా భారీ పరిమాణం లో సింథటిక్ డ్రగ్స్, కొకైన్, హెరాయిన్, గంజాయి పట్టుబడినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నా యి. అయితే పట్టుబడింది మొత్తం అక్రమ రవాణా లో చిన్న భాగమేనని నిపుణులు అంచనా వేస్తున్నారు. చట్టాల కన్నుగప్పి యువత చేతుల్లోకి చేరుతున్న మాదకద్రవ్యాల పరిమాణం మరింత ఎక్కువగా ఉండొచ్చనే వాస్తవం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. గంజాయి రికవరీలో ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ముందంజలో ఉండటం కూడా ఆందోళనకర అంశమే. తెలుగు రాష్ట్రాల్లో గంజాయి సులభంగా లభిస్తుండటం వల్ల యువత నేరాలబాట పడుతున్న సంఘటనలు పెరుగు తున్నాయి. చదువుకుని దేశ నిర్మాణంలో భాగస్వా ములు కావాల్సిన యువకులు నేరస్థులుగా మారడం సమాజానికి తీవ్రమైన హెచ్చరిక. గతంలో ఆంధ్రప్రదేశ్లోని విశాఖ మన్యంలో వేల ఎకరాల్లో సాగైన గంజాయి నిర్మూలనకు ప్రభు త్వం చర్యలు చేపట్టడం అభినందనీయం. అయినప్పటికీ ఒడిశా సరిహద్దుల నుంచి గంజాయి అక్రమ రవాణా కొనసాగుతుండటం, గోవా, బెంగ ళూరు, ముంబై వంటి నగరాల నుంచి సింథటిక్ డ్రగ్స్ తెలుగు రాష్ట్రాలకు చేరుతుండటం నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవస రాన్ని సూచిస్తోంది. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతా ల్లో ప్రత్యేక నిఘా, అంతర్రాష్ట్ర సమన్వయం, సాంకేతిక పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలి. దర్యాప్తు సంస్థల మధ్య సమన్వయం, ఆర్థిక లావాదేవీలపై నిఘా, సరిహద్దు భద్రత, సైబర్ పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా ఉండాలి. అదే సమయంలో వ్యసనానికి గురైన వారిని నేరస్థులుగా మాత్రమే కాకుండా పునరావాసం అవసరమైన బాధితులుగా కూడా చూడాల్సిన అవసరం ఉంది. డ్రగ్స్ నిర్మూలనలో ప్రభుత్వం ఒక్కటే విజయం సాధించలేదు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనించాలి. యువతలో మానసిక ఆరోగ్యం, జీవన నైపుణ్యాలు, విలువల విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి. స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సంస్థలు, మీడియా కూడా ప్రజల్లో చైతన్యం పెంచే బాధ్యతను మరింత సమర్థంగా నిర్వర్తించాలి. మత్తుమందుల వ్యాపారం దేశ భవిష్యత్తుపై జరుగుతున్న నిశ్శబ్ద యుద్ధం. ఈ యుద్ధంలో నిర్లక్ష్యానికి చోటు లేదు. ప్రభుత్వాలు కఠినమైన చట్ట అమలుతో పాటు సమర్థవంతమైన నివారణ చర్యలు చేపట్టాలి. కుటుంబాలు అప్రమత్తంగా ఉండాలి. విద్యాసంస్థలు బాధ్యత వహించాలి. సమాజం మొత్తం కలిసికట్టుగా పోరాడినప్పుడే యువభా రతాన్ని మత్తు రహిత, సురక్షిత, ప్రగతిశీల సమాజంగా తీర్చిదిద్దగలం. భవిష్యత్తు తరాలను కాపాడుకోవాలంటే ఇప్పుడే నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడం కాలానుగుణ అవసరం.

## మిషన్ భగీరథ కార్మికుల ఆధార్ వెరిఫికేషన్ వివరాల సేకరణ



**తల్లాడ, జూలై 16 (తెలంగాణ వాణి):**
తల్లాడ మండలం వెంకటరాం తండా సమీపంలోని కనిగిరి హిల్స్ మిషన్ భగీరథ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల ఆధార్ వెరిఫికేషన్, వ్యక్తిగత వివరాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్మికుల సంక్షేమం, పరిపాలనా అవసరాల దృష్ట్యా ఈ వివరాలను నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జేఈ వీరబాబు, ఎన్‌సీసీ మేనేజర్ యుగంధర్, ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి అనుబోతు బాలకృష్ణ, సబ్‌స్టేషన్ ఆపరేటర్ అసోసియేషన్ అధ్యక్షుడు తగరం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. కార్మికుల వివరాలు పూర్తిగా, ఖచ్చితంగా నమోదు చేయాలని అధికారులు సూచించారు.

## అంగన్వాడీ అక్రమ బదిలీలు, పదోన్నతులు రద్దు చేయాలి




**ఏటూరునాగారం, జూలై 16 (తెలంగాణ వాణి)**
ములుగు జిల్లా మానసపల్లి, పాప్కాపురం అంగన్వాడీ కేంద్రాల్లో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన బదిలీలు, పదోన్నతులను వెంటనే రద్దు చేసి, అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సామాజిక న్యాయవేదిక జిల్లా అధ్యక్షుడు గంపల శివకుమార్ డిమాండ్ చేశారు. గురువారం గ్రామస్తులు, గర్భిణీలు, బాలింతలతో కలిసి మానసపల్లి అంగన్వాడీ కేంద్రం వద్ద నిరసన చేపట్టిన ఆయన, కేంద్రాల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందాల్సిన సేవలు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. ఖాళీలను పారదర్శకంగా భర్తీ చేసి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. డిమాండ్లు నెరవేర్చకపోతే దశలవారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

- ఆగస్టు 15నుంచి ఒంటరి మహిళలకు నూతన పింఛన్ల మంజూరు
- రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి సీతక్క





**ములుగు,జులై16(తెలంగాణ వాణి):**
ఏజెన్సీ ప్రాంతాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో వేగం పెంచాలని,ఆగస్టు 15వ తేదీ నుంచి ఒంటరి మహిళలకు నూతన పెన్షన్ లను అందించడం జరుగుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్ ,గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా,మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు ఏటూరు నాగారం ఐటిడిఏ కార్యాలయంలో గురువారం కన్నాయిగూడెం, మంగపేట, ఏటూరు నాగారం ఏజెన్సీ మండలాలకు సంబంధించిన వివిధ శాఖల అభివృద్ధి పనుల పురోగతి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, దరఖాస్తుల స్థితిగతులపై రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు, ఐటిడిఏ పీఓ లెనిన్ వత్సల్ టొప్పోతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా శాఖల వారీగా అభివృద్ధి పనుల పురోగతి, ప్రభుత్వ పథకాల పంపిణీ, ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిష్కార స్థితిగతులను సంబంధిత శాఖ అధికారులను అడిగి తెలుసుకుని అవసరమైన ఆదేశాలు జారీ చేశారు. ఏజెన్సీ గ్రామాల సర్పంచులు తమ గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మౌలిక వసతుల అవసరాలు, ప్రజల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేసి అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గృహం అందేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల వారీగా పేదవారి జాబితాలను సిద్ధం చేసి అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆగస్టు 15వ తేదీ నుంచి ఒంటరి మహిళలకు నూతన పింఛన్లను అందించడం జరుగుతుందని, అర్హుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. పింఛన్ పొందుతున్న లబ్ధిదారులు మరణించినట్లయితే వారి పేర్లను వెంటనే జాబితా నుంచి తొలగించి పారదర్శకంగా వ్యవహరించాలని ఆదేశించారు. పలు గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు అందుబాటులో లేని కారణంగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి గ్రామాల అభివృద్ధి పనులను నిర్లక్ష్యం చేయకుండా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని కోరారు.
ఏజెన్సీ గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, ప్రజలు గ్రామాల్లో ఉన్న సమయాల్లోనే వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి ఆరోగ్య సేవలు అందించాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, ఆహారం, భద్రతతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను గుత్తేదారులు నాణ్యతా ప్రమాణాలతో,నిర్ణీత గడువులో పూర్తి చేసేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పంట మార్పిడిపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు, నకిలీ పురుగుమందుల విక్రయాలను కట్టడి చేస్తూ యూరియా సరఫరా సక్రమంగా జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా గ్రామపంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించడం హర్షణీయమైన విషయమని మంత్రి పేర్కొన్నారు. మహిళా సంఘాల సభ్యులు స్థానికంగా లభించే వనరులను వినియోగించుకుని వినూత్న జీవనోపాధి అవకాశాలను సృష్టించుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని, ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# ఒకే స్థలానికి రెండు పట్టాలు

**అధికారుల జోక్యం కోరుతున్న గ్రామస్తులు**





**తల్లాడ, జూలై 16 (తెలంగాణ వాణి):**
తల్లాడ మండలం అంబేద్కర్‌నగర్‌లో ఒకే ఇంటి స్థలంపై ఇద్దరు కుటుంబాలు హక్కు చేయడంతో వివాదం నెలకొంది. పాగా మరియమ్మ 2006లో మంజూరైన పట్టా ఆధారంగా స్థలం తనదేనని చెబుతుండగా, ఖమ్మం కనక తాము ఇంటి నిర్మాణం చేసి, ఇంటి పన్ను, విద్యుత్, నీటి బిల్లులు చెల్లిస్తున్నామని, తమ వద్ద కూడా పట్టా ఉందని పేర్కొన్నారు. ఈ వివాదం నేపథ్యంలో ఘర్షణ చోటుచేసుకుని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఒకే స్థలానికి రెండు పట్టాలు ఎలా జారీ అయ్యాయో విచారించి, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## నూతన వధువు ను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య.



**తల్లాడ, జులై 16 (తెలంగాణ వాణి)**
: నారాయణపురం ఎస్సీ కాలనీలో. కోట దానియేలు మరియమ్మ కుమార్తెను నూతన వధువును ఆశీర్వదించిన. బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు. సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య ఆశీర్వదించారు . నూతన వధువుకి శుభాకాంక్షలు చెప్పి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బి ఆర్ ఎస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షుడు రెడ్డెం వీర మోహన్ రెడ్డి, తల్లాడ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పెరిక చిన్నబ్బాయి . ఉప సర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి. టౌన్ అధ్యక్షులు . జి వి ర్. టౌన్ ఉపాధ్యక్షులు సంగసాని శ్రీను, గొల్లగూడెం నాయకులు వీర కృష్ణ , తెల్లూరి రఘు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# కొండరెడ్లకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి




**అశ్వారావుపేట, జూలై 16 (తెలంగాణ వాణి):**
కొండరెడ్ల కుటుంబాలకు తక్షణమే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, గ్రామంలోని మౌలిక సమస్యలను పరిష్కరించాలని ఆదివాసి కొండరెడ్ల సంఘం వ్యవస్థాపక గౌరవ అధ్యక్షుడు ముర్ల రమేష్ డిమాండ్ చేశారు. గురువారం అశ్వారావుపేట ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేసిన ఆయన, కొండరెడ్లు విద్య, ఉపాధి రంగాల్లో వెనుకబడి ఉన్నారని, విద్యుత్, రహదారులు, తాగునీరు, సాగునీటి వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రజాప్రతినిధులు స్పందించి కొండరెడ్ల సమస్యలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పిశెట్టి రవీందర్ రెడ్డి, బొల్లి దాసిరెడ్డి, ఉప్పిశెట్టి మంగారెడ్డి, గురుగుంట్ల నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ వాణి కథనానికి స్పందించిన అధికారులు

## తొలగించిన చెట్ల కొమ్మలు

**జూలూరుపాడు, జూలై 16 (తెలంగాణ వాణి):**
మండలంలోని వెంగన్నపాలెం గ్రామపంచాయతీ పరిధిలో ఎస్‌బీఐ బ్యాంకు, అటవీ శాఖ కార్యాలయం సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు చెట్ల కొమ్మలు ఆనుకుని ప్రమాదకర పరిస్థితి నెలకొన్న విషయాన్ని తెలంగాణ వాణి ప్రచురించగా, అధికారులు వెంటనే స్పందించారు. సంబంధిత శాఖ సిబ్బంది సంఘటనా




తెలంగాణ వాణి

చెట్ల కొమ్మలతో ట్రాన్స్‌ఫార్మర్‌కు ముప్పు ,స్థానికుల్లో భయం

పట్టించుకోని అధికార యంత్రాంగం

జూలూరుపాడు: జూన్ 24 ( తెలంగాణ వాణి):
మండల కేంద్రంలో ఉన్న వెంగన్నపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్‌బీఐ బ్యాంకు, అటవీశాఖ కార్యాలయం సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెట్లు విపరీతంగా పెరిగి, వాటి కొమ్మలు ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకే స్థితికి చేరుకోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆనుకుని పెరిగిన చెట్లు, విద్యుత్ తీగలకు దగ్గరగా ఉండటంతో ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని ప్రజలు చెబుతున్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఈదురుగాలులు, వర్షాల ప్రభావంతో చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై పడే ప్రమాదం ఉందని, దీనివల్ల షార్ట్‌సర్క్యూట్లు, విద్యుత్ అంతరాయాలు, అగ్నిప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజల రాకపోకలు అధికంగా ఉండే రద్దీ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ప్రమాదం సంభవిస్తే తీవ్ర పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల గ్రామపంచాయతీ అధికారులు, విద్యుత్ శాఖ సిబ్బంది సమన్వయంతో వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించి తగిన భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదం జరిగే వరకు వేచి చూడకుండా ముందస్తు చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించాలని మండల వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

epaper.telanganavanidaily.com
25 Jun 2026 - Page 2

స్థలానికి చేరుకుని ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. దీంతో షార్ట్‌సర్క్యూట్, అగ్నిప్రమాదం, విద్యుత్ అంతరాయం వంటి ప్రమాదాలు తప్పినట్లు స్థానికులు తెలిపారు. సమస్యపై వెంటనే స్పందించి చర్యలు చేపట్టిన అధికారులను గ్రామస్తులు అభినందించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి పరిష్కారానికి దోహదపడుతున్న తెలంగాణ వాణి పాత్రను కూడా వారు ప్రశంసించారు.



## ప్రతి వైద్యుడు కనీసం ఒక మొక్క నాటాలి: డాక్టర్ బంగారయ్య

**వనపర్తి, జూలై 16 (తెలంగాణ వాణి):**
వనపర్తి ప్రభుత్వ ఎంసీహెచ్ ఆసుపత్రి ఆవరణలో గురువారం ఆర్ఎంఓ డాక్టర్ బంగారయ్య మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆసుపత్రుల్లో మొక్కలు నాటడం వల్ల స్వచ్ఛమైన గాలి, ఆక్సిజన్ లభించడంతో పాటు రోగులకు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. ప్రతి వైద్యుడు కనీసం ఒక మొక్క నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ గౌరీదేవి, రజిని, శానిటేషన్ సూపర్వైజర్ గంధం భాస్కర్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలి

**పలుస శంకర్ గౌడ్**



**వనపర్తి, జూలై 16 (తెలంగాణ వాణి)**
: యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం మాత్రమే ఎదురుచూడకుండా స్వయం ఉపాధి ద్వారా తమతో పాటు ఇతరులకు కూడా ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. వనపర్తిలో యువకులు ప్రారంభించిన స్వదేశీ మార్ట్ దుకాణాన్ని ఆయన సందర్శించి అభినందించారు. ఖాదీ, స్వదేశీ వస్తువులు, సేంద్రియ ఆహార పదార్థాల విక్రయం ద్వారా ప్రజల ఆరోగ్యానికి ఉపయోగపడే సేవలు అందించడం అభినందనీయమన్నారు. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త గంధం నాగరాజు, శ్రీనివాస్, యువకులు శివరాజ్, నర్సింహా స్వామి, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## కొల్లూరు డబుల్ బెడ్‌రూమ్ దుకాణాల రిజిస్ట్రేషన్‌కు సిపి రెడ్డి చొరవ



**తెల్లాపూర్ జూలై 16 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
డబుల్ బెడ్‌రూమ్ ప్రాజెక్టులో వేలం పాట ద్వారా దుకాణాలు కొనుగోలు చేసిన వారి సమస్యలపై చిలకమర్రి ప్రభాకర్ రెడ్డి స్పందించారు. సంగారెడ్డి హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ సి హెచ్ చలపతి గారిని కలిసి చర్చించి, దుకాణాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. వారి చొరవతో త్వరలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమయ్యేలా అధికారులు అంగీకరించినట్లు సమాచారం.

## తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్‌చెరు, జూలై 16 (తెలంగాణ వాణి):**
పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి (జీఎంఆర్) గురువారం తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఉదయం సుప్రభాత సేవలో పాల్గొన్న అనంతరం ప్రత్యేక దర్శనం చేసుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా టీటీడీ అధికారులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా, టీటీడీ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. శ్రీ వేంకటేశ్వర స్వామివారి అనుగ్రహంతో పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలు, ఆయురా రోగ్యాలతో ఉండాలని, రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, సుభిక్షం, అభివృద్ధి కలగాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు గూడెం సందీప్ రెడ్డి, సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, సోమ శీనయ్య, సుధాకర్ గౌడ్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

## అన్ని శాఖల అధికారులు నిరంతరం కృషి చేసి మండలాన్ని ప్రగతి పదంలో ఉంచాలి



**రాజపేట జూలై: 16(తెలంగాణ వాణి విలేకరి)**
మండల ప్రజా పరిషత్ కార్యాలయం రాజాపేట సమావేశ మందిరములో మండల ప్రత్యేక అధికారి బి దేవ్ సింగ్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మరియు మండల క్లస్టర్ ప్రత్యేక అధికారి డి ఆర్ డి ఓ శ్రీ టీ నాగిరెడ్డి శ్రీత మండల అభివృద్ధి అధికారి శ్రీమతి కే నాగవేణి సమక్షంలో మండలంలోని అన్ని శాఖల గౌరవ అధికారులు మరియు గ్రామ కార్యదర్శులు ఈజీఎస్ సిబ్బంది టెక్నికల్ అసిస్టెంట్స్ తో అన్ని శాఖలలో జరుగుతున్న కార్యక్రమాలపై సబ్జెక్టు వారీగా అన్ని శాఖల అధికారులతో చర్చించి మండలంలో ప్రభుత్వ పథకాల అమలులో ఉద్యోగులు నిరంతరం కృషిచేసి మండలాన్ని ప్రగతి పదము లో ఉంచాలని అధికారులు సూచించినారు. సమావేశంలో మండల ప్రజా పరిషత్ పర్యవేక్షకులు ఏ ఇన్న రెడ్డి మండల పరిషత్ అధికారి ఏ కిషన్ మండల హౌసింగ్ ఏఈ వి వివేకానంద ఇతర శాఖల ఏఈ మండల విద్యాధికారి కార్యాలయం సిబ్బంది అందరూ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మంజీరా నది తీరంలో పోలీసుల హెచ్చరిక: రాఘవాపూర్ వద్ద బోర్డుల ఏర్పాటు



**జహీరాబాద్/ న్యాల్కల్: జూలై 16:(తెలంగాణ వాణి ప్రతినిధి)**
హద్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల రాఘవాపూర్ గ్రామ పరిధిలోని మంజీరా నది తీరంలో హద్నూర్ సబ్ ఇన్‌స్పెక్టర్ దోమ సుజిత్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టారు. నదిలో నీటి ఉధృతి, లోతైన ప్రాంతాలను గుర్తించి, ప్రజలను ప్రమాదాల నుండి రక్షించేందుకు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. నదిలోకి స్థానికులు, పర్యాటకులు ఎవరూ దిగకుండా బోర్డుల ద్వారా స్పష్టమైన సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా యువత ఈ ప్రాంతంలో సెల్ఫీలు దిగడం, ఈతకు వెళ్లడం వంటి సాహసాలు చేయవద్దని పోలీసులు హెచ్చరించారు. నది పరివాహక ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు నిరంతరం నిఘా ఉంటుందని ఎస్ఐ స్పష్టం చేశారు. ప్రజల ప్రాణ రక్షణే ధ్యేయంగా హద్నూర్ పోలీసులు తీసుకున్న ఈ ముందస్తు చర్యపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పాఠశాల ల ఆకస్మిక తనిఖీ.

### ఇబ్రహీంపట్నం ఎంపీడీవో గణేష్.



**ఇబ్రహీంపట్నం జులై 16 (తెలంగాణ వాణి విలేకరి)**
జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రం లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, బీసీ హాస్టల్ ఎస్సీ హాస్టల్ లను ఎంపీడీవో సిహెచ్ గణేష్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. క్లాస్ రూమ్ లో పిల్లలతో మాట్లాడుతూ నేను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే విద్యను అభ్యసించి ఈరోజు ఉద్యోగం లో ఉన్నానని మీరు కూడా శ్రద్ధగా చదివి ఉన్నతమైన స్థానాలలో నిలవాలని తెలియజేసారు. పాఠశాల లోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యత పరిణామాలను తనిఖీ చేసారు. స్కూల్ ప్రాంగణంలోని శానిటేషన్ పనులను ఎప్పటికప్పుడు జరిగేలా చూడాలని ప్రధానోపాధ్యాయులకి సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రధానోపాధ్యాయులు రజిత, ఎస్సీ హాస్టల్ వార్డెన్ పెద్దులు, గ్రామపంచాయతీ కార్యదర్శి పుల్ల రామకృష్ణ పాల్గొన్నారు.

# కే.కే. కమిటీ సమావేశానికి ఉద్యమకారులు తరలిరావాలి

### తెలంగాణ ఉద్యమకారుల సంఘం పిలుపు

**రాజపేట, జూలై 16 (తెలంగాణ వాణి)**
: తెలంగాణ ఉద్యమకారుల సమస్యలపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కే.కే. కమిటీ సమావేశానికి జూలై 17న అధిక సంఖ్యలో హాజరుకావాలని రాజపేట మండల తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. హైదరాబాద్ సచివాలయం ఎదుట ఉన్న అమర జ్యోతి భవన్‌లో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల ఉద్యమకారులతో కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉద్యమకారుల అభిప్రాయాలు, సూచనలు కమిటీకి తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో సమావేశానికి హాజరుకావాలని సంఘం మాజీ అధ్యక్షుడు మారోజు కుమారస్వామి, మాజీ ఉపాధ్యక్షుడు పెంట సత్యనారాయణ కోరారు. కార్యక్రమంలో ఊట్కూరి అశోక్ గౌడ్, చింతల దాసు, కర్రే చంద్రమౌళి, ఉచింతల బాలయ్య, వేముల గోపి, రామ్‌గళ్ళ శ్రీను, తునికి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



## శ్రీగిరి దేవాలయ జగన్నాథ రథోత్సవానికి శివపరాశక్తి పీఠాధిపతి మనోహర్ గురూజీ రాక

**రాజపేట, జూలై 16 (తెలంగాణ వాణి):**
యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండల శివారులోని శ్రీగిరి సంకల్ప సిద్ధి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం నిర్వహించనున్న జగన్నాథ (బలభద్ర) రథోత్సవ కార్యక్రమానికి శివపరాశక్తి పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ కాసు మనోహర్ గురూజీ, పద్మ దంపతులు, వారి కుటుంబ సభ్యులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా దేవాలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవంతో పాటు ఉదయం 9 గంటలకు వరాహ స్వామి హోమం, లక్ష్మీనరసింహ స్వామి హోమం నిర్వహించనున్నట్లు దేవాలయ ట్రస్ట్ యాజమాన్యం వెల్లడించింది. ఈ మహోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ట్రస్ట్ నిర్వాహకులు కోరారు



## పట్టణ అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం అవసరం: ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

**జగిత్యాల, జూలై 16 (తెలంగాణ వాణి):**
పట్టణ అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకమని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. గురువారం రోటరీ క్లబ్, ఏపీ ప్రివెంటివ్ హెల్త్ క్లినిక్, రెడ్‌క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో సత్యహరిశ్చంద్ర శ్మశానవాటికకు మూడు డెడ్‌బాడీ ఫ్రీజర్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రోటరీ క్లబ్ గత నాలుగు దశాబ్దాలుగా జిల్లా ప్రజలకు విశేష సేవలు అందిస్తూ సామాజిక సేవలో ఆదర్శంగా నిలుస్తోందన్నారు. శ్మశానవాటికలో ఫ్రీజర్ల ఏర్పాటు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, కౌన్సిలర్లు, రోటరీ క్లబ్ సభ్యులు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




# కాంట్రాక్టర్ పనులకు పంచాయతీ ట్రాక్టర్ వినియోగం

**విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్**

**తిమ్మాపూర్, జూలై 16 (తెలంగాణ వాణి):**
తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామంలో పంచాయతీకి చెందిన వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్‌ను ప్రైవేట్ కాంట్రాక్టర్ పనులకు వినియోగిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి. గ్రామంలో జరుగుతున్న భవన నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ సొంతంగా వాటర్ ట్యాంకర్ ఏర్పాటు చేసుకోవాల్సి ఉండగా, పంచాయతీ ట్రాక్టర్‌ను వినియోగిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ అవసరాలకు వినియోగించాల్సిన వాహనాన్ని ప్రైవేట్ పనులకు ఉపయోగించడం నిబంధనలకు విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి, బాధ్యులైన కాంట్రాక్టర్‌తో పాటు సహకరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.



## గ్రామ సభల ద్వారా రీ-సర్వే పనులు వేగవంతం చేయాలి




**జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి.ఎస్. లత**

జగిత్యాల: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూసర్వే--రీ-సర్వే కార్యక్రమాన్ని గ్రామ సభల ద్వారా వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి.ఎస్. లత అధికారులను ఆదేశించారు. గురువారం ధర్మపురి, గొల్లపెల్లి మండలాల పరిధిలోని నాగారం, అబ్బాపూర్ గ్రామాల్లో భూముల రీ-సర్వేకు సంబంధించిన అవగాహన సదస్సులు (గ్రామ సభలు) ఆమె ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భూసర్వే--రీ-సర్వే ప్రక్రియ, సర్వే యాక్ట్--1923 నిబంధనలు, సర్వే నిర్వహణ విధానం, రైతులు పాటించాల్సిన అంశాలపై గ్రామ రైతులు, ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు. గ్రామ సభల ద్వారా ప్రజల్లో సందేహాలను నివృత్తి చేసి, రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి, గొల్లపెల్లి తహసీల్దార్లు శ్రీనివాస్, మాజీద్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జమ్మికుంటలో గోశాల ఏర్పాటు చేయాలి: మున్సిపల్ చైర్మన్‌కు మహిళా కాంగ్రెస్ వినతి

**జమ్మికుంట జులై 16, (తెలంగాణ వాణి ప్రతినిధి) :**
జమ్మికుంట పట్టణంలో శాశ్వత గోశాల ఏర్పాటు చేయాలని కోరుతూ పట్టణ మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు పూదరి రేణుక శివకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్‌తో పాటు మున్సిపల్ పాలకవర్గ సభ్యులకు పట్టణ ప్రజల తరఫున వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జమ్మికుంట పట్టణ అభివృద్ధి కోసం మున్సిపల్ పాలకవర్గం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అభినందిస్తున్నామని తెలిపారు. అదే సమయంలో పట్టణంలో గోమాతల సంరక్షణ కోసం శాశ్వత గోశాల ఏర్పాటు అత్యంత అవసరమని వారి దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం పట్టణంలోని అనేక గోవులు రోడ్లు, వీధుల్లో సంచరిస్తూ ప్లాస్టిక్ కవర్లు, విషపూరిత వ్యర్థాలు, మిగిలిపోయిన ఆహార పదార్థాలను తిని అనారోగ్యానికి గురవుతున్నాయని పేర్కొన్నారు. అలాగే రహదారులపై గోవులు సంచరించడం వల్ల తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పాటు రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం కూడా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ప్రజల భద్రతతో పాటు మూగజీవాల సంక్షేమానికి సంబంధించిన కీలకమైన అంశమని తెలిపారు. అందువల్ల మున్సిపల్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు ఈ సమస్యను అత్యవసరంగా పరిగణించి, గోశాల ఏర్పాటు కోసం తగిన స్థలాన్ని గుర్తించి మంజూరు చేయడంతో పాటు అవసరమైన చర్యలను వెంటనే ప్రారంభించాలని పట్టణ ప్రజల తరఫున వినమ్రంగా విజ్ఞప్తి చేశారు. గోమాతల సంరక్షణ అనేది కేవలం సామాజిక బాధ్యత మాత్రమే కాకుండా మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొంటూ, ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ పాలకవర్గం చేపట్టి జమ్మికుంట పట్టణానికి ఆదర్శంగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.



## ఈ-కోర్ట్స్ యాప్‌తో కేసు స్థితి తెలుసుకోవచ్చు: న్యాయవాది హరి అశోక్ కుమార్

**జగిత్యాల, జూలై 16 (తెలంగాణ వాణి):**
కోర్టు కేసుల తాజా స్థితిని తెలుసుకోవడానికి ఈ-కోర్ట్స్ సర్వీసెస్ మొబైల్ యాప్ ఎంతో ఉపయోగకరమని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది హరి అశోక్ కుమార్ తెలిపారు. నేషనల్ ఇన్‌ఫర్మాటిక్స్ సెంటర్ రూపొందించిన ఈ యాప్‌లో 16 అంకెల సీఎన్‌ఆర్ నంబర్ లేదా కేసు నంబర్, కక్షిదారు పేరు, న్యాయవాది పేరుతో కేసు వివరాలు తెలుసుకోవచ్చన్నారు. అలాగే కాజ్ లిస్ట్, ఈ-ఫైలింగ్, ఈ-పే, వర్చువల్ కోర్టులు, సుప్రీంకోర్టు, హైకోర్టుల తీర్పులు తదితర సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. న్యాయ సంబంధిత సమాచారాన్ని ప్రజలకు సులభంగా చేరవేసేందుకు ఈ-కోర్ట్స్ సర్వీసెస్ యాప్ ఎంతో ఉపయోగపడుతుందని హరి అశోక్ కుమార్ పేర్కొన్నారు.



## ఓటరు జాబితా సవరణను సద్వినియోగం చేసుకోవాలి

### పుల్లూరి స్వప్న సదానందం




**జమ్మికుంట, జూలై 16 (తెలంగాణ వాణి):**
ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ప్రతి అర్హత కలిగిన ఓటరు సద్వినియోగం చేసుకోవాలని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం కోరారు. గురువారం మార్కెట్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఇప్పటికే ఓటరు జాబితాలో పేర్లు ఉన్నవారు తమ వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. బీఎల్‌ఓలకు అవసరమైన పత్రాలు అందజేసి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగబద్ధమైన హక్కు అని పేర్కొన్న ఆమె, ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం ఆగస్టు 3 వరకు పొడిగించిన నేపథ్యంలో జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

## హుజురాబాద్ దళిత బంధు పెండింగ్ దరఖాస్తులపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో ప్రణవ్ భేటీ



**హైదరాబాద్, జూలై 16, (తెలంగాణ వాణి ప్రతినిధి) :**
హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితేల ప్రణవ్ గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గంలోని దళిత సోదరులకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న దళిత బంధు పథకం మంజూరుపై మంత్రి దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన నిధులు విడుదల చేసి లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి పెండింగ్‌లో ఉన్న దళిత బంధు కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, త్వరలోనే అర్హులైన లబ్ధిదారులకు పథకం ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జమ్మికుంట మండల అధ్యక్షుడు వీరమనేని పరశురామ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మాస్యూటికల్ పరిశోధనలో ఎస్.వి. నూకరాజుకు పీహెచ్‌డీ

**పటాన్‌చెరు, జూలై 16 (తెలంగాణ వాణి):**
దీర్ఘకాలిక వాపు సంబంధిత వ్యాధుల చికిత్సపై వినూత్న పరిశోధన చేసిన గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ పరిశోధక విద్యార్థి శ్రీధరాల వి. నూకరాజుకు పీహెచ్‌డీ డిగ్రీ లభించింది.



'దీర్ఘకాలిక వాపు సంబంధిత వ్యాధుల చికిత్స కోసం వాహకం ద్వారా పనిచేసే వినూత్న స్థానిక (టాపికల్) టెరిఫ్లునోమైడ్ ఔషధ రూపాల అభివృద్ధి' అనే అంశంపై ఆయన పరిశోధన నిర్వహించి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు ఫార్మసీ అధ్యాపకుడు డాక్టర్ పవన్ కుమార్ మార్గదర్శకత్వం వహించినట్లు తెలిపారు.
ఈ పరిశోధనలో రుమటాయిడ్ ఆర్థరైటిస్, అటోపిక్ డెర్మటైటిస్ వంటి వ్యాధులకు దుష్ప్రభావాలను తగ్గిస్తూ, ఔషధాన్ని నేరుగా ప్రభావిత ప్రాంతానికి చేరవేసే వినూత్న టాపికల్ ఔషధ రూపాలను అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. భవిష్యత్ క్లినికల్ పరిశోధనలు, వాణిజ్యీకరణకు ఈ అధ్యయనం ఉపయోగపడుతుందని వెల్లడించారు. నూకరాజుకు పీహెచ్‌డీ లభించిన సందర్భంగా గీతం విశ్వవిద్యాలయం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్‌ఆర్ వర్మ, ఫార్మసీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. శివకుమార్‌తో పాటు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

## తడ్కల్‌లో జల్ మహోత్సవం నిర్వహణ







**కంగ్టి, జూలై 16 (తెలంగాణ వాణి):**
సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం తడ్కల్ గ్రామంలో గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జైపాల్, సర్పంచ్ సుగుణ మల్లారెడ్డి ఆధ్వర్యంలో జల్ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుగుణ మల్లారెడ్డి మాట్లాడుతూ, ప్రజలు సురక్షితమైన, శుద్ధి చేసిన తాగునీటిని వినియోగించాలని సూచించారు. కలుషిత నీటితో ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని, నీటిని మరిగించడం లేదా ఆర్ఓ/యూవీ ఫిల్టర్ ద్వారా శుద్ధి చేసి వినియోగించడం మంచిదన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ భగవాన్ సమీర్, యువ నాయకుడు కృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఔషధ గిడ్డంగిని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

### వర్షాకాల వ్యాధుల మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశం



**మంచిర్యాల, జూలై 16 (తెలంగాణ వాణి):**
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ గురువారం జిల్లా సెంట్రల్ మెడికల్ స్టోర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులకు సరఫరా చేస్తున్న మందుల నిల్వలు, వ్యాక్సిన్ల భద్రత, అత్యవసర ఔషధాల లభ్యతను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో సరఫరా చేయాలని, ఎక్స్‌పైరీ తేదీలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. అలాగే పాము, కుక్క, తేలు కాట్ల మందులతో పాటు మలేరియా, డెంగ్యూ, అతిసారం, వాంతులు, విరేచనాల నివారణకు అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తగినంత నిల్వ ఉంచాలని సూచించారు. తనిఖీలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అనిల్ రావు, చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ శ్రీవాణి, ఫార్మసీ అధికారులు, జిల్లా వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ముధోల్ కాంగ్రెస్‌కు కొత్త సారథి

### మండల అధ్యక్షుడిగా సాపేవార్ కిష్టయ్య..

### మాజీ ఎమ్మెల్యే జి. విట్టల్ రెడ్డి ఘన సన్మానం



**నిర్మల్ - ముధోల్: జూన్ 16 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
నిర్మల్ జిల్లా ముధోల్ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా గన్నోరా గ్రామానికి చెందిన సాపేవార్ కిష్టయ్య నియమితులయ్యారు. ఈ సందర్భంగా ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి. విట్టల్ రెడ్డి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సురేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ అఫ్రోజ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శులు పోతన యాదవ్, బషీర్, మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు, పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు. కొత్త బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు.

## విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తులు నాణ్యవంతంగా తయారు చేయాలి

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



**నిర్మల్, జూలై 16 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తులు నాణ్యవంతంగా ఉండాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం నిర్మల్ పట్టణంలోని స్కంద ఔట్ ఫిట్ కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తుల తయారీ తీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా దుస్తుల తయారీకి సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే దుస్తులు నాణ్యవంతంగా ఉండాలని పేర్కొన్నారు. సమయానికి యూనిఫాంలు తయారు చేసి విద్యార్థులకు అందించాలని తెలిపారు. ఈ పరిశీలనలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ జిల్లాను ఆరోగ్య వంతమైన జిల్లాగా మార్చడమే లక్ష్యం

### జిల్లా వైద్య, ఆరోగ్య శాఖధికారిణి డాక్టర్ సాధన

**ఆదిలాబాద్, జులై : 16 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
ఆదిలాబాద్ జిల్లాలోని పేద ప్రజలందరికి మెరుగైన వైద్య సేవలు అందించి ఆరోగ్యవంతమైన జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యాశాఖాధికారిణి డాక్టర్ సాధన అన్నారు. జిల్లా కేంద్రంలోని కేర్ అండ్ సపోర్ట్ సెంటర్ లో నెట్వర్క్ అఫ్ హెల్పింగ్ పూర్, సూర్, వై ఆర్ జి లింక్ వర్కర్స్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో 25 మంది హెచ్ ఐ వి తో జీవిస్తున్న వారి కుటుంబంలో హెచ్ ఐ వి లేని పిల్లలకు మరియు పేద విద్యార్థులకు చదువును ప్రోత్సాహించుటకు పిల్లలకు అవసరమైన పుస్తకాలు, బ్యాగులు, పెన్సిల్, పెన్నులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖధికారి డాక్టర్ సాధన మాట్లాడుతూ హెచ్ ఐ వి వైరస్ తో జీవిస్తున్న పిల్లలకు, తల్లిదండ్రులకు వ్యాధి ఉండి , హెచ్ ఐ వి లేని పిల్లలకు అందరితో పాటు చదువు చాలా కీలకమని



పేర్కొన్నారు. విద్యను ప్రోత్సాహించడం ద్వార ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని, హెచ్ ఐ వి ఉన్నవారికి ప్రభుత్వ ఏ ఆర్ టి సెంటర్ ద్వారా అందించే మందులతో పాటు వారి పిల్లలకు దాతలు అవసరమైన పుస్తకాలు అందించడం, సహాయ సహకారాలు అందించడం ద్వారా వారు ఉన్నత చదువులు చదవచ్చని అన్నారు. నాకో మరియు తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి నిర్దేశించిన 95:95:99 లక్ష్యాలను ఆదిగమించి ఆదిలాబాదు జిల్లాను హెచ్ ఐ వి లేని జిల్లాగా ఆదర్శంగా నిలపాలని కోరారు. హెచ్ ఐ వి తో జీవిస్తున్న చిన్నారులకు చదువు విషయం లో ఎటువంటి ఆందోళన చెందాలిసిన అవసరం లేదని, వారికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. చిన్నారులకు ఉన్నత విద్య, పెద్దలకు ఆసరా పెన్షన్స్ కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని హామీ ఇచ్చారు. హెచ్ ఐ వి నివారణలో ప్రజలందరికీ అవగాహన సదస్సులు, అవసరమయినవారికి ఉచిత పరీక్షలు జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణా విభాగంనుండి నిర్వహిస్తున్నామని అన్నారు. వ్యాధి ఉన్నవారికి ఉచితమందులు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఎయిడ్స్ రహిత సమాజం కోసం అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ఎయిడ్స్ అండ్ లెప్రసీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఈశ్వర్ రాజ్, ఏ ఆర్ టి సెంటర్ వైద్యులు డాక్టర్ పద్మిని ప్రియదర్శిని, సి పి యమ్ నాగరాజు, ఎన్ జి ఓ ప్రతినిధులు సాయినాథ్, భాగ్యలక్ష్మి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మారుతిగూడ గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

- 40 వాహనాలు స్వాధీనం
- మహువా పూల పులిసిన ద్రావణాన్ని ధ్వంసం చేసిన పోలీసులు
- అదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి.

**బేలా, జులై : 16 ( తెలంగాణ వాణి )**
బేలా మండలంలోని మారుతిగూడ గ్రామంలో గురువారం తెల్లవారుజామున ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టి శాంతిభద్రతల పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా గుడుంబా తయారీపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు 1 లీటర్ గుడుంబాను, గుడుంబా తయారీకి వినియోగిస్తున్న పాత్రలు, సామగ్రిని ధ్వంసం చేశారు. అలాగే గుడుంబా తయారీ కోసం నిల్వ ఉంచిన మహువా పూల పులిసిన ద్రావణాన్ని అక్కడికక్కడే ధ్వంసం చేశారు. గ్రామంలో వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి పలు నిబంధనలు ఉల్లంఘించిన 40 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని, గుడుంబా తయారీ, విక్రయాలపై నిరంతర నిఘా కొనసాగిస్తామని డీఎస్పీ



ఎల్. జీవన్ రెడ్డి తెలిపారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించేందుకు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామని అన్నారు. గ్రామంలో సిసిటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అసంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జైనథ్ సీఐ జి. శ్రావణ్ కుమార్, ఎస్ఐలు మధుకృష్ణ, గౌతమ్, పీర్ సింగ్ నాయక్, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ ఆలయంలో తాగునీటి బోరు ప్రారంభం



**మందమర్రి, జూలై 16 (తెలంగాణ వాణి):**
మందమర్రి పట్టణంలోని 24వ వార్డు పోచమ్మ దేవాలయంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన తాగునీటి బోరును గురువారం కాంగ్రెస్ నాయకుడు, అఖిల భారత యాదవ మహాసభ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలయంలో తాగునీటి సమస్యను కార్మిక మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే స్పందించి మున్సిపల్ అధికారుల ద్వారా బోరు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. ఇందుకు మంత్రి, ఎంపీకి స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మంద తిరుమలరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ పైడి మల్ల నర్సింగ్, పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యం

### అట్రాసిటీ కేసుల పరిష్కారంలో జాప్యం వద్దు: బక్కి వెంకటయ్య

**ఆదిలాబాద్, జూలై 16 (తెలంగాణ వాణి):**
ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అట్రాసిటీ కేసుల దర్యాప్తు, సబ్‌ప్లాన్ నిధుల వినియోగం,





గురుకుల విద్యాసంస్థలు, ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి హామీ పథకం తదితర అంశాలపై సమీక్షించారు. అట్రాసిటీ కేసుల దర్యాప్తు, బాధితులకు పరిహారం చెల్లింపులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను లక్షిత వర్గాల అభివృద్ధికే వినియోగించాలని ఆదేశించారు. సమావేశంలో కమిషన్ సభ్యులు, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటిడిఏ పీవో మంద మకరందు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అధికారుల చొరవతో బాల్య వివాహం నిలిపివేత



**నిర్మల్, జూలై 16 (తెలంగాణ వాణి)**
కుంటాల మండలంలోని ఓ గ్రామంలో 14 ఏళ్ల బాలికకు జరగనున్న బాల్య వివాహాన్ని జిల్లా బాలల సంరక్షణ విభాగం, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు గురువారం అడ్డుకున్నారు. బాలిక కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించి, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాల్య వివాహ నిరోధక చట్టం--2006పై అవగాహన కల్పించారు. దీంతో బాలికకు 18 ఏళ్లు పూర్తైన తర్వాతే వివాహం జరిపిస్తామని తల్లిదండ్రులు లిఖితపూర్వక హామీ ఇచ్చారు. బాల్య వివాహాలు నిర్వహించినా, ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసితే వెంటనే సంబంధిత అధికారులకు లేదా చైల్డ్ హెల్ప్‌లైన్--1098కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## రక్షణ కల్పించి నాకు ప్రాణ బిక్ష పెట్టండి



**మందమర్రి, జూలై 16 (తెలంగాణ వాణి విలేకరి)**
నా భర్త చీకటి శ్రీశైలం వలన నాకు,నా పిల్లలకు ప్రాణ భయం ఉందని నా భర్త నుండి రక్షణ కల్పించి నాకు ప్రాణ బిక్ష పెట్టాలని మందమర్రి షిర్కే ఏరియాకు చెందిన స్వరూప రాణి పోలీ సులను కోరారు. గురు వారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆరోగ్య మిత్ర లొ విధులు నిర్వహిస్తున్న నాకు మొదటి భర్త చనిపోగా మంద మర్రి కి చెందిన భోగ చంద్ర మొగిలి ధ్వార పరిచయం అయిన చీకటి శ్రీశైలంతో తన వివాహం జరిగిందని తెలిపారు. పెళ్లి అయిన నాటి నుండి నా భర్త శ్రీశైలం ఎలాంటి పని చేయకుండా నా పై అనుమానం తో వేధింపులకు గురిచే స్తున్నాడని ఆమె ఆరో పించారు. వివాహానికి ముందు అతడు మరో ఇద్దరు మహిళలను వివాహం చేసుకున్న విషయం తనకు తెలియదని, మోస పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆరోగ్యమిత్రగా పనిచేస్తూ ఇద్దరు పిల్లలను పోషిస్తున్నా నని తెలిపారు. నా భర్త తో వేధింపులు భరించ లేక ఈ నెల 22 న విడాకులు తీసుకు నేందుకు ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు. ఈనెల 12 న నా భర్త శ్రీశైలం తో పాటు, భోగ చంద్ర మొగిలి, చీకటి సతీష్, బెల్లంపల్లి కి చెందిన అనసూయమ్మ లు ఇంటికి వచ్చి బీభత్సం సృ ష్టించి ఇంటిలో సామాను తీసుకు వెళ్లార ని తెలిపారు. నేను విధులకు వెళ్తున్న సమయం లొ నా వెంట పడుతు వేది స్తున్నాడని తెలిపారు. నా భర్త నుండి తనకు బెదిరిం పులు వస్తున్నా యని, అతని బావ చంద్రమౌళి కూడా అతనికి సహ కరిస్తున్నాడని ఆరోపిం చారు. ఈ విషయంపై పలుమార్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యకు పరిష్కారం లభించలే దని చెప్పారు. తనకు, తన పిల్లలకు ప్రాణహాని ఉందని, వెంటనే రక్షణ కల్పించి న్యాయం చేయాలని అధికారుల ను, ప్రజాప్రతినిధులను ఆమె కోరారు.

## సాంఘిక సంక్షేమ గురుకులాల్లో తాత్కాలిక పోస్టుల భర్తీ



**లక్షెట్టిపేట, జూలై 16 (తెలంగాణ వాణి):**
జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో తాత్కాలిక అధ్యాపకులు, ఉపాధ్యాయుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టీజీఎస్‌డబ్ల్యూఆర్ఐఈఎస్ సమన్వయకర్త కోటూరి రామ కళ్యాణి తెలిపారు. జూనియర్ లెక్చరర్, పీజీటీ, టీజీటీ, స్పెషల్ టీచర్ పోస్టులకు జూలై 23 సాయంత్రం 4 గంటలలోగా లక్షెట్టిపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. జూలై 25న జూనియర్ లెక్చరర్, పీజీటీ, జూలై 27న టీజీటీ, స్పెషల్ టీచర్ పోస్టులకు డెమో తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 40 ఖాళీలు ఉన్నాయని, అర్హత కలిగిన అభ్యర్థులు విద్యార్హతల ఒరిజినల్ ధ్రువపత్రాలు, బయోడేటాతో హాజరుకావాలని కోరారు. పోస్టుల వివరాలు, అర్హతలపై పూర్తి సమాచారం సంబంధిత గురుకుల కళాశాలలో అందుబాటులో ఉంటుందని తెలిపారు

## ఆపదలో ఆదుకునేందుకే 'ఆపద మిత్ర'

### జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఆదిలాబాద్, జులై : 16 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
జిల్లాలో విపత్తుల సమయంలో అత్యవసర సహాయక చర్యలు అందించేందుకు సంసిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. స్థానిక టిటిడిసిలో కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ సంయుక్తంగా చేపట్టిన మూడు రోజుల 'ఆపద మిత్ర' ఓరియంటేషన్ శిక్షణా ముగింపు శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రదర్శనలను వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సుమారు 40 మంది విద్యార్థిని, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని నూతన నైపుణ్యాలను నేర్చుకున్నారని తెలిపారు. వరదలు, అగ్నిప్రమాదాలు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు లేదా మానవ తప్పిదాల వల్ల ప్రమాదాలు సంభవించినప్పుడు తక్షణమే స్పందించి రెస్క్యూ ఆపరేషన్లు చేపట్టడానికి ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. ఇలాంటి అత్యవసర సహాయక చర్యల కోసం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, ఎన్డిఎంఏ, అలాగే తెలంగాణ ప్రభుత్వ రెవెన్యూ శాఖల నుంచి అవసరమైన



అత్యాధునిక పరికరాలు, మౌలిక వసతులు జిల్లాకు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఈ శిక్షణ ద్వారా నేర్చుకున్న విపత్తు నిర్వహణ అంశాలు విద్యార్థుల భవిష్యత్తుకు, వారి కెరీర్‌కు ఎంతో ఉపయోగపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ముగింపు కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి సురేష్ కుమార్, స్టేషన్ అగ్నిమాపక అధికారి జైత్రం, గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బంది వర్ష, అగ్నిమాపక శాఖ అధికారులు, సాంకేతిక సిబ్బంది, శిక్షకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## భూముల సర్వే, రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**



**నిర్మల్, జూలై 16 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
భూముల సర్వే, రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం భైంసా మండలం బాబుల్ గావ్ గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మ్యాపులు లేని గ్రామాలకు మ్యాపులు తయారు చేసేందుకు చేపట్టిన సర్వేను పారదర్శకంగా చేపట్టాలన్నారు. రీ సర్వేకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో అత్యాధునిక సాంకేతికత వినియోగించి రీ సర్వే ప్రక్రియ చేపట్టిందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను మొత్తాన్ని గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. స్థానిక రైతులతో మాట్లాడుతూ, రైతులందరూ ఆయిల్ ఫామ్ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. తక్కువ పెట్టుబడి, తక్కువ శ్రమతో ఎక్కువ లాభాలు వస్తాయని అన్నారు. వాతావరణ పరిస్థితులు, నీటిలభ్యత, వర్షాలను బట్టి పంటలు సాగు చేయాలన్నారు. పంట మార్పిడి విధానాలపై దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏడి ల్యాండ్ సర్వే ల్యాండ్ రికార్డ్ నరసింహ మూర్తి, తహసిల్దార్ శశి భూషణ్, గ్రామ సర్పంచ్ అనసూయ మహేందర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మలింగేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



**ఎల్లారెడ్డి జులై 16 తెలంగాణ వాణి ప్రతినిధి**
శ్రీ శ్రీ శ్రీ మరకత ఆత్మ లింగేశ్వర దేవాలయం ఆత్మకూర్ గ్రామం నకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే శ్రీ మదన్ మోహన్ రావు వచ్చి ప్రత్యేక పూజలు చేసినారు. గ్రామ సర్పంచ్ ఉమన్నగారి లక్ష్మి ఎమ్మెల్యే ని గజమాల తో సత్కారం చేసి నారు. ఆలయంకమిటీ అధ్యక్షులు కుంట రాఘవరెడ్డి. మాజీ సర్పంచ్ గడ్డం బాల్ రెడ్డి. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడు చు ప్రహరీ గోడ నిర్మాణం గురించి సుమారు ఇరవై లక్షలు మంజూరు చేయండి అని కోరిన వెంటనే ఎమ్మెల్యే స్పందించి నా వంతుగా నా ఫండ్స్ నుండి మంజురు చేస్తున్నాను అని స్పీచ్ లో చెప్పిన్నారు.వెంటనే ఎమ్మెల్యే ప్రహరీ గోడ భూమి పూజ చేసినారు గ్రామస్థులు చెప్పట్లతో కృతజ్ఞతలు చెప్పినారు

## రాజన్న కళ్యాణకట్టలో ఈవో రమాదేవి ఆకస్మిక తనిఖీ

**అదనపు డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవు**



**వేములవాడ,జూలై 16 (తెలంగాణ వాణి ప్రతినిధి) :**
?శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం కళ్యాణకట్టలో ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) ఎల్. రమాదేవి గురువారం ఉదయం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ఆరోపణలు, భక్తుల ఫిర్యాదుల నేపథ్యంలో ఆమె ముందస్తు సమాచారం లేకుండా క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. తలనీలాలు సమర్పించుకునేందుకు వచ్చిన భక్తులతో నేరుగా మాట్లాడి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విధుల్లో ఉన్న నాయి బ్రాహ్మణులను వీడియో రికార్డింగ్ ద్వారా ఇంటర్వ్యూ చేసి వివరాలు సేకరించారు.?కళ్యాణకట్టలో పనిచేసే సిబ్బందికి యూనిఫాం, ఐడీ కార్డులు తప్పనిసరిగా ఇవ్వాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. భక్తుల నుంచి తలనీలాల కోసం అదనపు డబ్బులు డిమాండ్ చేస్తే సహించేది లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే కాంట్రాక్టును రద్దు చేసి బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని హెచ్చరించారు. భక్తుల అవగాహన కోసం టికెట్ ధర రూ.50 మాత్రమేనని, అదనపు డబ్బులు ఇవ్వద్దని తెలిపే బోర్డులను ప్రదర్శింపజేశారు. నగదు వసూళ్లపై నిఘా ఉంచేందుకు ఇద్దరు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. ప్రాంగణమంతా సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంచాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఫుటేజీ ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో ఆలయ డీఈవో నవీన్ కుమార్, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, నరేందర్, శివసాయి తదితరులు పాల్గొన్నారు.

## కోమటిరెడ్డి సంకీర్త్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



**చౌటుప్పల్, జూలై 16 (తెలంగాణ వాణి):**
మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తనయుడు, సుశీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ఎండీ కోమటిరెడ్డి సంకీర్త్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు పలువురు కాంగ్రెస్ నాయకులు.శంషాబాద్ విమానాశ్రయంలో చౌటుప్పల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, యువజన కాంగ్రెస్ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్బనబోయిన రాము యాదవ్ పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా సంకీర్త్ రెడ్డి ఆయురారోగ్యాలతో, విజయాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లెంకలపల్లి ఉపసర్పంచ్ మెతరి శంకర్, దాడి యశ్వంత్ రెడ్డి, పున్న మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# సిరిచెల్మ గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

- **156 బైక్స్, 2 ఆటోలు, 8 కార్లు, బొలెరో వాహనాలు స్వాధీనం.**
- **జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్.**

**ఆదిలాబాద్, జులై : 16 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
ప్రజల రక్షణ, సంరక్షణ సక్రమంగా నిర్వహించడానికి కమ్యూనిటీ కాంటాక్ట్ లను నిర్వహించడం జరుగుతుందని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ గ్రామం నందు ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు 120 మంది సిబ్బందితో కమ్యూనిటీ కాంటాక్ట్ ను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సరైన ధ్రువ పత్రాలు లేనటువంటి 156 ద్విచక్ర వాహనాలు, 2 ఆటో లను, 8 కార్లు, బొలెరో లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని, నెంబర్ ప్లేట్ లేని 3 వాహనాలపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అక్రమంగా కల్తీ కళ్ళు తయారు చేయడానికి ఉపయోగపడే ముడి సరుకు అమ్మోనియం బైకార్బొనేట్ ఒక క్వింటల్ వరకు స్వాధీనం చేసుకొని నిందితుడు సురేందర్ గౌడ్ పై కేసు నమోదు చేస్తున్నట్లు , అదేవిధంగా అక్రమ మద్యం అనుమతులు లేకుండా విక్రయిస్తున్న పి శ్రీనివాస్ గౌడ్ అనే వ్యక్తి వద్ద దాదాపు 200 బాటిల్ల మద్యం



లభించినట్లు అతనిపై ఇచ్చిన పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రజలతో మాట్లాడుతూ అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సక్రమంగా జీవించాలని తెలిపారు. గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, దొంగతనాలు, దోపిడీలు చేయకుండా, సత్ప్రవర్తనతో మెదలాలను తెలిపారు. గొడవలకు దారి తీసేలా ప్రవర్తించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వీడిసి అక్రమాలు, బలవంతపు వసూళ్లు, నంబర్ ప్లేట్లు లేకుండా తిరగడం, దొంగ వాహనాలను కొనుగోలు చేయడం లాంటివి చేయవద్దని తెలిపారు. ఇదివరకే కేసులలో నమోదైన వారిపై సస్పెక్ట్ షీట్లు, రౌడీ షీట్స్ ఓపెన్ చేయడం జరిగిందని, మిగిలిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామ ప్రజలు నేరాలు చేసే వారి సమాచారం 8712659973 నెంబర్ కు వాట్సప్ ద్వారా సమాచారం అందించవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడ తాయని తెలిపారు. విద్యార్థులకు చిన్నప్పటినుండి చదువుపై ఆసక్తి పెంచేలా తల్లిదండ్రులు కృషి చేయాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యం పై దృష్టి సారించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపకుండా ఉండాలని, ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు సక్రమంగా వాహనాలను నడుపుతూ ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పి రుత్విక్ సాయి కొట్టే, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి ఎన్ వెంకట నరసయ్య, ఎ ఆర్ డిఎస్పీ కమతం ఇంద్రవర్ధన్, సిఐ నరేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ డి వెంకటి,టి మురళి, ఎస్సైలు, స్పెషల్ పార్టీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి

- **పెండింగ్ అట్రాసిటీ కేసులను వేగంగా పరిష్కరించాలి**
- **రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**

**నిర్మల్, జూలై 16 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో ప్రతి అర్హుడికి చేరేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు, పరిష్కార ప్రక్రియను వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల అమలు, అట్రాసిటీ కేసులు, భూ సమస్యలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితర అంశాలపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమావేశానికి ముందు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రాం చిత్రపటాలకు చైర్మన్ బక్కి వెంకటయ్య, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, కమిషన్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు అమలవుతున్న సంక్షేమ పథకాల పురోగతి, అట్రాసిటీ కేసుల నమోదు, దర్యాప్తు, ఛార్జిషీట్ల దాఖలు, బాధితులకు పరిహారం చెల్లింపు తదితర అంశాలపై శాఖల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల వివరాలు, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా పథకం, కులాంతర వివాహాల ఆర్థిక సహాయం, ఇందిరమ్మ ఇండ్లు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద జాబ్‌కార్డుదారులకు కల్పిస్తున్న ఉపాధి వంటి అంశాలను సమీక్షించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ఆలస్యం లేకుండా అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు పారదర్శకంగా, నిర్దేశిత గడువులో పూర్తి చేసి బాధితులకు పరిహారం సకాలంలో అందేలా చూడాలని సూచించారు. ప్రతి నెల చివరి వారంలో మండల స్థాయిలో సివిల్ రైట్స్ డే నిర్వహించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి తగిన






పని దినాలు కల్పించాలని, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని మౌలిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి సంబంధించిన అభివృద్ధి నిధులు ఎక్కడైనా పెండింగ్‌లో ఉంటే ముఖ్యమంత్రితో మాట్లాడి విడుదలయ్యేలా కృషి చేస్తానని చైర్మన్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తూ కామన్ మెనూ అమలు చేస్తున్నామని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా పథకం, కులాంతర వివాహాల ఆర్థిక సహాయం అందిస్తున్నామని వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 4,306 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో ఎస్సీ, ఎస్టీ కూలీలకు ఉపాధి కల్పనలో నిర్మల్ జిల్లా రాష్ట్రంలో ముందంజలో ఉందన్నారు. బ్యాంకుల ద్వారా 199 ద్విచక్ర, త్రిచక్ర విద్యుత్ వాహనాలను ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అందించినట్లు పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు వేగవంతంగా కొనసాగుతోందని, వివిధ దశల్లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు కమిషన్ సభ్యులు మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, 60 సంవత్సరాలు పూర్తి చేసిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉపాధి అవకాశాలు కల్పించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, ప్రవీణ్, లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏఎస్పీ సాయికిరణ్, డీఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, డీఎస్పీ శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## భైంసా రామాలయానికి రూ.50 లక్షలు

**నిర్మల్ - భైంసా: జూన్ 16 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
భైంసా పట్టణంలోని రామ్‌లీలా మైదానంలో నిర్మించనున్న రామాలయానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షల నిధులు మంజూరు చేసింది.ఈ మేరకు ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ భైంసాలోని తన నివాసంలో ఆలయ కమిటీ సభ్యులకు మంజూరు పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేస్తూ ఆలయ నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని చెప్పారు.మున్సిపల్ చైర్మన్ తుమ్మొల్ల దత్తాత్రి,కౌన్సిలర్ చింతపండు రజిత--మహేశ్ మాట్లాడుతూ రామాలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం భైంసా ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరినట్టేనని పేర్కొన్నారు. ఎమ్మెల్యే హయాంలో పట్టణ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరవుతున్నాయని కొనియాడారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు,కాలనీవాసులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు రావుల రాము,కౌన్సిలర్ అమోల్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు,భక్తులు పాల్గొన్నారు.

## గట్టు మైసమ్మ బోనాల ఏర్పాట్లపై అధికారులకు వినతి




**నిర్మల్ - భైంసా: జూన్ 16 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో జరగనున్న శ్రీ గట్టు మైసమ్మ బోనాల మహోత్సవాన్ని పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు,పారిశుద్ధ్యం, తాగునీరు,విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ హిందూ ఉత్సవ సమితి నాయకులు భైంసా టౌన్ సీఐ సాయి కుమార్, మున్సిపల్ చైర్మన్ తుమొల్ల దత్తాత్రికి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పెండేపు కాశీనాథ్ హిందూ ఉపాధ్యక్షుడు తోట రాము,ఏనుపోతుల మల్లేష్, పాపన్న,మారుతి తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## తాండూర్ పి ఏ సి ఎస్ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభించిన ఎమ్మెల్యే మదన్ మోహన్



**ఎల్లారెడ్డి జులై 16 తెలంగాణ వాణి ప్రతినిధి**
ఎల్లారెడ్డి నియోజకవర్గ పరిధిలోని నాగిరెడ్డిపేట మండలం తాండూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రూ.55 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన షాపింగ్ కాంప్లెక్స్‌ను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సహకార సంఘాలు రైతులకు సేవలందించడంతో పాటు ఆర్థికంగా బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం ద్వారా పి ఏ సి ఎస్ కు శాశ్వత ఆదాయ వనరు ఏర్పడి, ఆ ఆదాయాన్ని రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు వినియోగించుకోవచ్చని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో సహకార వ్యవస్థను బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉందని, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతుల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, వ్యవసాయ అనుబంధ సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు.ఈ కార్యక్రమంలో పి ఏ సి ఎస్ చైర్మన్, డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, రైతులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సంగెం హై లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభించిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**యాదాద్రి భువనగిరి, జులై 16(తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**
వలిగొండ మండలం సంగెం--బోలేపల్లి గ్రామాల మధ్య మూసి నదిపై నిర్మించనున్న సంగెం హై లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులను భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. పనులు ప్రారంభించే ముందు భీమలింగం కట్ట వద్ద శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... స్థానిక ఎమ్మెల్యేగా ప్రజలు తనపై ఉంచిన నమ్మకానికి తగిన విధంగా నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న ఈ హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే సంగెం-బోలేపల్లి గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు అన్ని కాలాల్లో సురక్షితమైన రాకపోకలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. సుమారు రూ.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ బ్రిడ్జికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పరిపాలనా ఆమోదం తెలుపుతూ నిధులు మంజూరు చేశారనీ, రాష్ట్ర రోడ్లు ఉ భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక చొరవతో పనులు ప్రారంభమయ్యేలా సహకరించారని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి కి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ బ్రిడ్జి




శంకుస్థాపన కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని, ప్రస్తుతం నిర్మాణ పనులను ప్రారంభించామని వెల్లడించారు.భువనగిరి నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నానని పేర్కొన్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఈ ఈ ఆర్‌డబి సరితారాణి, భువనగిరి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## కొల్లూరు డబుల్ బెడ్‌రూమ్ ఫేజ్-2లో SIR కార్యక్రమం.. పాల్గొన్న తెల్లాపూర్ కాంగ్రెస్ అధ్యక్షులు సీ.పి. రెడ్డి

**తెల్లాపూర్ జూలై 16 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
కొల్లూరు డబుల్ బెడ్‌రూమ్ ఫేజ్-2లోని 59వ బ్లాక్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ కాంగ్రెస్ అధ్యక్షులు సీ.పి. రెడ్డి పాల్గొని ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను నమోదు చేసుకోవడంతో పాటు అవసరమైన సవరణలు చేయించుకోవాలని ఆయన సూచించారు. SIR కార్యక్రమం ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ప్రక్రియ. ఈ కార్యక్రమంలో రోహిణి, శివకాంత్, సిద్ధు, శ్యామ్, ప్రశాంత్ సాయి, అక్బర్ ఖాన్, బీఎల్‌వోలు (BLO\T), బీఎల్ఏలు (BLA\T) తదితరులు పాల్గొని ఓటర్లకు అవసరమైన



సహాయం అందించారు. స్థానిక ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో హాజరై తమ ఓటరు వివరాలను సరిచేసుకున్నారు.

## అంకిరెడ్డిగూడెం సర్పంచ్‌పై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదు

### సీసీ రోడ్డు పనులు వేగవంతంగా పూర్తి చేయాలి డీఎల్పీఓ ప్రతాప్ నాయక్



**చౌటుప్పల్, జూలై 16(తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**
యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ పై వచ్చిన ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని జిల్లా స్థానిక పంచాయతీ అధికారి (డీఎల్పీఓ) ప్రతాప్ నాయక్ స్పష్టం చేశారు. గ్రీవెన్స్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు బుధవారం అంకిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో డీఎల్పీఓ ప్రతాప్ నాయక్ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించి ఫిర్యాదుపై విచారణ చేపట్టారు. విచారణ అనంతరం సర్పంచ్‌పై చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని అవి అవాస్తవమని స్పష్టం చేశారు. అనంతరం సీఎస్ఆర్ నిధుల ద్వారా దివీస్ సంస్థ సౌజన్యంతో రూ.98 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు, అండర్ డ్రైనేజ్ నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామ అభివృద్ధికి అత్యంత కీలకమైన ఈ పనులకు ఎవరూ ఆటంకాలు కల్పించకుండా సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 20 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణం చేపడుతున్న నేపథ్యంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న స్థల యజమానులు తమ స్థలాలకు సంబంధించిన ప్రహరీలు, అరుగులు, ర్యాంపులు లేదా ఇతర నిర్మాణాలు గ్రామపంచాయతీ రికార్డుల ప్రకారం కేటాయించిన స్థలం కంటే ఎక్కువగా ప్రభుత్వ రోడ్డును ఆక్రమించి ఉంటే, వారికి కార్యదర్శి ద్వారా నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. కొలతల ప్రకారం ఆక్రమణలు నిర్ధారణ అయితే వాటిని తప్పనిసరిగా తొలగిస్తామని హెచ్చరించారు. సర్పంచ్ సుర్వి మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ 20 అడుగుల రోడ్డు నిర్మాణం పూర్తయిన అనంతరం ఇరువైపులా మిగిలిన ఖాళీ ప్రదేశాల్లో గ్రామపంచాయతీ నిధులతో పూర్తి స్థాయి రోడ్లను అభివృద్ధి చేస్తామని తెలిపారు. గ్రామాభివృద్ధి పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, అభివృద్ధికి అడ్డంకులు సృష్టించకుండా ప్రజలంతా భాగస్వాములు కావాలని గ్రామ ప్రజలను కోరారు.

## బస్సు రాకపోకలకు అడ్డంకులు తొలగించిన మహిళలు, గ్రామస్తులు

### గ్రామ సర్పంచ్ లక్ష్మీ కుమార్.




**మెదక్ జిల్లా, కౌడిపల్లి జూలై 15 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం వెంకటాపూర్ గ్రామంలో ప్రభుత్వ భూమిని అక్రమంగా కబ్జా చేసి బస్సుల రాకపోకలకు అడ్డంకులు కల్పిస్తున్నారని ఆరోపిస్తూ గ్రామస్తులు బుధవారం ఆందోళనకు దిగారు. గ్రామంలోని మహిళలు, యువకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు కలిసి నిరసన వ్యక్తం చేస్తూ కబ్జాదారులు ఏర్పాటు చేసిన కడీలు, జాలీలు, ఇతర అడ్డంకులను తొలగించారు. గ్రామస్తుల కథనం ప్రకారం, గతంలో బస్సులు గ్రామంలోకి రాకపోవడంతో విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు సమీప ఊరుచివారా నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యను గుర్తించిన గ్రామ సర్పంచ్ సంబంధిత అధికారులతో మాట్లాడి బస్సు గ్రామంలోకి వచ్చి తిరిగి వెళ్లేందుకు అవసరమైన స్థలాన్ని ఏర్పాటు చేయించడంతో పాటు బస్సు సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో గ్రామ ప్రజలకు ఎంతో ఉపశమనం లభించింది. అయితే ప్రస్తుతం అదే ప్రభుత్వ స్థలాన్ని కొందరు అక్రమంగా ఆక్రమించి కడీలు, జాలీలు ఏర్పాటు చేయడంతో బస్సులు తిరగడానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని గ్రామస్తులు ఆరోపించారు. ఈ కారణంగా విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లడంలో, ఉద్యోగులు తమ విధులకు చేరుకోవడంలో, అలాగే అత్యవసర సమయంలో ప్రజలు ప్రయాణించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వ భూములను కబ్జా చేయడం చట్టవిరుద్ధమని, ప్రజల ప్రయోజనాలను దెబ్బతీసే ఇటువంటి చర్యలను సహించబోమని గ్రామస్తులు స్పష్టం చేశారు. అక్రమ కబ్జాలను వెంటనే తొలగించి బస్సుల రాకపోకలు యథావిధిగా కొనసాగేందుకు అవసరమైతే రెవెన్యూ, పోలీసు రవాణా శాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారూ.

## విద్యార్థులు స్మార్ట్ క్లాస్‌రూమ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

### నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి



**వనపర్తి, జూలై 16, (తెలంగాణ వాణి ప్రతినిధి)**
నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి గురువారం వనపర్తి జిల్లా మర్రికుంట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన స్మార్ట్ క్లాస్‌రూమ్‌ను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ప్రారంభించారు. అనంతరం స్మార్ట్ బోర్డు పై విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ సంతకాన్ని చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీఎస్ఆర్ నిధుల ద్వారా జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం రూ.1.35 కోట్ల వ్యయంతో 16 స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. అనంతరం 9వ తరగతి విద్యార్థులతో ఎంపీ ముచ్చటించారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, తమ చిన్నతనంలో ఇలాంటి స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, ఆధునిక సౌకర్యాలు అందుబాటులో లేవని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం విద్యార్థుల కోసం అనేక సౌకర్యాలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివి పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణతతో పాటు అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతికతను విద్యాభ్యాసంలో వినియోగించుకొని విజ్ఞానాన్ని మరింత పెంపొందించు కోవాలని సూచించారు. స్మార్ట్ క్లాస్‌రూమ్‌ల ద్వారా బోధన మరింత ప్రభావవంతంగా మారి విద్యార్థుల అభ్యాస నైపుణ్యాలు మెరుగుపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ట్ మేనేజర్ శివ కుమార్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లిమిటెడ్ మహబూబ్‌నగర్ క్లస్టర్ హెడ్ ప్రవీణ్ కుమార్ ఝూ , జీఐబీ స్టేట్ హెడ్ పీ. జే. శ్రావణ్ కుమార్, బ్రాంచ్ మేనేజర్ సీహెచ్ వెంకటేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీలకు అందని "స్కానింగ్" సేవలు

- మాతా శిశు ఆసుపత్రిలో నిరుపయోగంగా లక్షల రూపాయల స్కానింగ్ యంత్రాలు
- రేడియాలజిస్టు లేక గర్భిణీలకు తీవ్ర ఇబ్బందులు
- ప్రైవేట్ డయాగ్నస్టిక్ కేంద్రాలతో పేదలపై ఆర్థిక భారం




**మంచిర్యాల, జూలై 16 (తెలంగాణ వాణి):**
జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని ప్రభుత్వ మాతా శిశు ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు అత్యంత కీలకమైన అల్ట్రాసౌండ్ స్కానింగ్ సేవలు అందుబాటులో లేకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. స్వయానా వైద్యులైన రాష్ట్ర మంత్రి, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలోని ప్రధాన ప్రభుత్వ మాతా శిశు ఆసుపత్రిలో రేడియాలజిస్టు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని ప్రభుత్వం ప్రకటిస్తున్న సమయంలో జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలోనే ఇలాంటి పరిస్థితులు నెలకొనడం పట్ల ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. తల్లి, శిశువు ఆరోగ్య పరిరక్షణలో అత్యంత ప్రాధాన్యం కలిగిన స్కానింగ్ పరీక్షలు ప్రభుత్వ ఆసుపత్రిలో అందకపోవడంతో ప్రతిరోజూ వందలాది మంది గర్భిణీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి ఆధునిక అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరికరాలను ఏర్పాటు చేసినప్పటికీ, వాటిని నిర్వహించేందుకు అవసరమైన నిపుణులు లేకపోవడంతో ఆ పరికరాలు వినియోగంలోకి రాక నిరుపయోగంగా మారినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లాలోని మందమర్రి, రామకృష్ణాపూర్, బెల్లంపల్లి, జైపూర్, చెన్నూర్, నెన్నెల, భీమారం, కోటపల్లి, లక్షెట్టిపేట్, హాజీపూర్ తదితర మండలాల తో పాటు జిల్లాలోని మారుమూల ప్రాంతాల గర్భిణీలు నిత్యం ఈ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా స్కానింగ్ సేవలు లభిస్తాయని ఆశించి వచ్చిన వారికి నిరాశే ఎదురవుతుందని బాధిత కుటుంబాలు పేర్కొంటున్నాయి. గర్భిణీలకు స్కానింగ్ సేవలు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ డయాగ్నస్టిక్ కేంద్రాలను ఆశ్రయించాల్సి వస్తుంది. దీంతో ఒక్కోసారి వేల రూపాయల వరకు ఆర్థిక భారం పడుతుండటంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణీలు, వారి కుటుంబ సభ్యుల వద్ద సరిపడా డబ్బులు లేకపోవడంతో తిరిగి వెళ్లి రావడం వల్ల శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా తీవ్ర భారం పడుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం తోనే ఇబ్బందులు

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తున్నామని చెబుతున్న నేతల మాటలు నీటి మూటలు లాగానే మారుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మహిళ సంక్షేమం కొరకు గర్భవతులగా ఉన్న సమయంలో వారికి మెరుగైన వైద్యం అందించాలని, సుఖ ప్రసవాలు, తల్లి, బిడ్డల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని ప్రతిష్టాత్మకంగా మాతా శిశు ఆసుపత్రులను నిర్మించినప్పటికి, ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం మూలంగా దేవుడు వరమిచ్చినా పూజారి ఇవ్వలేదనే చందంగా అన్ని పరికరాలు ఉన్నప్పటికీ నిపుణులు లేక వైద్య సేవలు అందకపోవడం శోచనీయమని పలువురు పేర్కొంటున్నారు.
గర్భస్థ శిశువు ఎదుగుదల, గుండె స్పందన, అవయవాల అభివృద్ధి, తల్లి ఆరోగ్య పరిస్థితి, గర్భంలోని నీటి పరిమాణం వంటి కీలక అంశాలను తెలుసుకోవడానికి అల్ట్రాసౌండ్ స్కానింగ్ అత్యంత అవసరం. ప్రతి దశలో వైద్యులు సూచించిన సమయానికి స్కానింగ్ చేయించుకోవడం వల్ల సమస్యలను ముందుగానే గుర్తించి, తల్లి బిడ్డల క్షేమానికి తగిన చికిత్స అందించే అవకాశం ఉంటుంది. అలాంటి అత్యవసర సేవ ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో లేకపోవడం ప్రజల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతోంది. ప్రభుత్వ నిధులతో కొనుగోలు చేసిన ఆధునిక స్కానింగ్ యంత్రాలు ఆసుపత్రిలో ఉన్నప్పటికీ, వాటిని నిర్వహించే నిపుణులైన రేడియాలజిస్టులు లేకపోవడంతో అవి నిరుపయోగంగా ఉండిపోతున్నాయి. ప్రభుత్వం లక్షల రూపాయలు ప్రజాధనం వెచ్చించి కొనుగోలు చేసిన ఆధునిక వైద్య పరికరాలు ప్రజలకు ఉపయోగపడకుండా, వృథావుతుందనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.

### ప్రజలపై ప్రైవేట్ భారం...

ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా లభించాల్సిన సేవలు అందకపోవడంతో గర్భిణీలు ప్రైవేట్ డయాగ్నస్టిక్ కేంద్రాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడడంతో, దీనిని ఆసరాగా తీసుకుని ప్రైవేట్ స్కానింగ్ కేంద్రాలు ఒక్కో స్కానింగ్ కు వందల నుంచి వేల రూపాయల వరకు వసూలు చేస్తుండటంతో ఆర్థికంగా వెనుకబడిన పేద కుటుంబాలకు ఇది తీవ్రమైన భారంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. గర్భస్థ సమయంలో అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు వెంటనే స్కానింగ్ అవసరం అవుతుండగా, ప్రభుత్వ ఆసుపత్రిలో ఆ సౌకర్యం లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడం వల్ల చికిత్స ఆలస్యం అయ్యే ప్రమాదం ఉందనే భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. సమయం వృథా కావడంతో పాటు గర్భిణీలు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు.

### ఆసుపత్రి నిర్వహణలో జిల్లా యంత్రాంగం విఫలం

ప్రజలకు సరైన వైద్య సౌకర్యాలు కల్పించాల్సిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, జిల్లా పాలనా అధికారులు, ఆసుపత్రి పర్యవేక్షణ అధికారులు ప్రజల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు సర్వత్ర వ్యక్తం అవుతుండగా, ఆసుపత్రి నిర్వహణపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రిలో రేడియాలజిస్టు లేకపోవడం వల్ల గర్భిణీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వెంటనే పరిష్కారం చూపించాల్సిన బాధ్యత గల అధికారులు ఆ దిశగా సమర్థవంతమైన చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. ప్రతిరోజూ వందలాది మంది గర్భిణీలు స్కానింగ్ సేవల కోసం ఆసుపత్రికి వస్తున్నప్పటికీ, వారికి సరైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం, రేడియాలజిస్టు నియామకంపై నిరంతరంగా ఉన్నతాధికారులతో సమన్వయం చేయకపోవడం వల్ల సమస్య మరింత తీవ్రమైందని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వ పథకాల అమలులో సమన్వయ బాధ్యతలు నిర్వహించాల్సిన అధికారులు ప్రజల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని పరిష్కార మార్గాలు అన్వేషించాలని పలువురు కోరుతున్నారు. వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం గర్భిణీ మహిళలకు నిర్ణీత వ్యవధిలో స్కానింగ్ పరీక్షలు నిర్వహించడం వల్ల శిశువు ఎదుగుదలలో లోపాలు, గర్భాశయ సమస్యలు, తల్లి ఆరోగ్య పరిస్థితిని ముందుగానే గుర్తించి చికిత్స అందించే అవకాశం ఉంటుందని, అలాంటి సేవలు ఆలస్యమైతే తల్లి, శిశువు ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రజాప్రతినిధులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించి, మాతా శిశు ఆసుపత్రికి శాశ్వత రేడియాలజిస్టును నియమించి, ఇప్పటికే ఉన్న స్కానింగ్ పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలనే డిమాండ్ ప్రజల నుండి వ్యక్తం అవుతుంది. అంతా వరకు ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తాత్కాలిక ప్రాతిపదికన ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి రేడియాలజిస్టును డిప్యుటేషన్‌పై నియమించి, గర్భిణీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు చూపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య రంగానికి పెద్దపీట వేస్తున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆసుపత్రిలో నెలకొన్న ఈ సమస్యకు యుద్ధప్రాతిపదికన పరిష్కారం చూపించాలని ప్రజలు, ప్రజాసంఘాలు కోరుతున్నాయి. లక్షల రూపాయల ప్రజాధనంతో ఏర్పాటు చేసిన పరికరాలు, ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుని, గర్భిణీలకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందిస్తారని ఆశిస్తున్నాం.

### సమస్య పరిష్కారానికి కృషి చేస్తాను

ఈ విషయమై మాతా శిశు సంరక్షణ జిల్లా అధికారిని డాక్టర్ అరుణశ్రీ ని ఫోన్లో సంప్రదించగా ఆమె మాట్లాడుతూ, గతంలో పనిచేసిన రేడియోలాజిస్టులు బదిలీపై వెళ్లగా, మరొక రేడియోలాజిస్ట్ ప్రసూతి సెలవులో వెళ్లనుండటం, ఆసుపత్రిలో సూపరింటెండెంట్ పోస్ట్ సైతం ఖాళీగా ఉండటంతో సమస్య తలెత్తిందని, సంబంధిత అధికారులను సంప్రదించి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

**మాతా శిశు సంరక్షణ జిల్లా అధికారిని డాక్టర్ అరుణశ్రీ**

# ఎస్సీ ఎస్టీలపై అత్యాచారాలు జరిగితే సాధ్యమైనంత ఎఫ్ఐఆర్ చేసి చార్జిషీట్ వేయాలి

- ఎస్సీ ఎస్టీలకు అన్యాయం జరిగితే పోలీసులు, రెవెన్యూ శాఖ అండగా ఉంటారు అనే భరోసా కల్పించాలి
- నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి
- ఎస్సీ ఎస్టీ అత్యాచార కేసుల్లో తప్పు చేసిన వారికి శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలి జిల్లా కలెక్టర్, డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ చైర్మన్ ఆదర్శ్ సురభి



**వనపర్తి, జూలై 16, (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో సాధ్యమైనంత త్వరగా కేసు నమోదు చేసి దోషులకు శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి నాగర్ కర్నూలు పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి తో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొనగా నిర్మాణాత్మక చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో 2018 నుంచి నమోదు అయిన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు, వాటి విచారణ, ప్రస్తుతం కేసు ఏ స్థాయిలో ఉన్నాయి, బాధితులకు అందిన పరిహారం పై ఒక్కో కేసు వారిగా సమీక్ష నిర్వహించారు. 2025 నుండి 2026 వరకు విచారణలో ఉన్న 12 కేసులపై కేసు వారిగా చర్చించారు. జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డి కేసు వారిగా వాటి పురోగతి స్థితిగతులను కమిటి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ 2020 నుండి 2026 వరకు ఒక్క కేసు నేరారోపణ జరగలేదని ఇందుకు బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. తప్పు చేసిన వారికి చట్టం ప్రకారం ఖచ్చితంగా శిక్ష పడాలని బాధితులకు న్యాయం జరగాలన్నారు. ఒకవేళ తప్పుడు కేసులు నమోదు చేస్తే విజిలెన్స్ కమిటీ సభ్యులు నచ్చచెప్పి కేసు ఉపసంహరించుకునే విధంగా చూడాలని సూచించారు. తప్పుడు కేసులు పెట్టడం, తప్పు చేసినప్పటికీ శిక్ష పడకుండా బయట దర్జాగా తిరుగుతుండటం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని చెప్పారు. అట్రాసిటీ కేసు నమోదు అయిన వాటిని సమగ్రంగా విచారించి తగిన ఆధారాలతో ఛార్జ్ షీట్ దాఖలు చేసి తప్పు చేసిన వారికి శిక్షలు పడే విధంగా చూడాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. 2020 లో నమోదు అయిన ఒక కేసు 2026లో ట్రయల్ కొరకు రావడం ఇంకా తేది ఖరారు కాకపోవడం పై విస్మయం వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ హాజరు కాకపోవడం చర్చనీయాంశం అయ్యింది. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో భూ సమస్యలు, ఎస్సీ ఎస్టీల భూములు కబ్జా వంటి కేసులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఎస్సీ ఎస్టీలకు న్యాయం చేకూర్చి అండగా నిలవాలని పోలీస్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రతినెల పౌర హక్కుల దినోత్సవం పకడ్బందీగా నిర్వహించి ఎస్సీ ఎస్టీలకు చట్టంపై అవగాహన కల్పించి భరోసా ఇవ్వాలని అధికారులకు కమిటీ సభ్యులకు సూచించారు. సంక్షేమ శాఖల అధికారులతో ఆయా సంక్షేమ శాఖల ద్వారా మంజూరు అయిన సంక్షేమ పథకాల పై శాఖల వారిగా ఆరా తీశారు. ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సకాలంలో లబ్ధి చేకూర్చే విధంగా సంక్షేమ శాఖ అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం ద్వారా మెస్ ఛార్జీలు కాస్మోటిక్ చార్జీలు వంటివి పెంచి విద్యార్థులకు అండగా నిలిచేందుకు కృషి చేస్తుంటే వసతి గృహాల్లో వార్డెన్లు సరిగ్గా ఉండటం లేదని, దాని పర్యావసానంగా విద్యార్థులు నష్టపోతున్నారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్న స్థానిక శాసన సభ్యులు తూడి మెగా రెడ్డి మాట్లాడుతూ వనపర్తి పట్టణంలోని పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించడమే కాకుండా తాను సైకిళ్లు, ఇతర సహకారం అందించడం వల్ల గత సంవత్సరం కంటే ఈసారి విద్యార్థుల నమోదు. శాతం గణనీయంగా పెరిగిందని, వారికి అదనంగా వసతి గృహాలు మంజూరు అయ్యేవిధంగా చూడాలని పార్లమెంట్ సభ్యులను కోరారు. సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ అత్యాచార కేసుల్లో తప్పు చేసిన వారికి శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలనీ అందుకు లైన్ డిపార్ట్మెంట్ అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. పౌర హక్కుల దినోత్సవం ప్రతి నెల సజావుగా నిర్వహించడం జరుగుతోందని దీనిని మరింత పకడ్బందీగా నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. అట్రాసిటీ కేసులో బాధితులకు పరిహారం అందించే విషయంలో దాదాపు 75 లక్షల రూపాయలు పరిహారం అందించాల్సి ఉన్నా నిధులు మంజూరు కాకపోవడం వల్ల పెండింగ్ లో ఉన్నాయని, నిధులు మంజూరు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని పార్లమెంట్ సభ్యులను కోరారు. ఎస్సీ ఎస్టీ కమిటీ సభ్యుడు మాదారి భోజరాజు కొన్ని సమస్యలను కమిటి దృష్టికీ తీసుకువచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్ ఖీమ్య నాయక్, జడ్పీ సీఈవో యాదయ్య, షెడ్యూల కులాల సంక్షేమ అధికారి రాంజీ రావు, ఈ డి ఎస్సి కార్పొరేషన్ సిరాజుద్దీన్ , ఆర్డిఓ సుబ్రహ్మణ్యం పిడి డి ఆర్ డి ఓ ఉమాదేవి, కమిటీ సభ్యులు డి.పి ఆర్.ఓ సీతారాం, డి డబ్ల్యు ఓ సుధారాణి, సి. విశ్వం బాబు, శంకర్ నాయక్, నాగన్న, రామచంద్రయ్య, వీరప్ప మాదారి భోజరాజు, స్వచ్ఛంద సంస్థల నుండి చిన్నమ్మ థామస్, వెంకట గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్య కావాలి వ్యసనాలు వద్దు

### హుజూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్ రహిత సమాజంపై అవగాహన సదస్సు.

**హుజూర్ నగర్ జులై 16 తెలంగాణ వాణి**
యువత మాదకద్రవ్యాల (డ్రగ్స్) బారిన పడకుండా వారి భవిష్యత్తును కాపాడుకోవడమే లక్ష్యంగా హుజూర్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. హుజూర్‌నగర్ పోలీసులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై హనుమాన్ నాయక్ మాట్లాడుతూ.. నేటి యువతే దేశానికి భవిష్యత్తు అని, విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో ఉంటూ ఉన్నత లక్ష్యాలను అలవర్చుకోవాలని సూచించారు. సరదా కోసం అలవాటు చేసుకునే వ్యసనాలు జీవితాలను రోడ్డున పడేస్తాయని హెచ్చరించారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు అలవాటుపడితే శారీరక, మానసిక ఆరోగ్యం క్షీణించడమే కాకుండా చట్టపరమైన కఠిన చర్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. కళాశాల పరిసరాల్లో గానీ, చుట్టుపక్కల ప్రాంతాల్లో గానీ ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే లేదా డ్రగ్స్ విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. ప్రతి విద్యార్థి సమాజ మార్పులో భాగస్వామి కావాలని, డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు పోలీసులకు




సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, పోలీస్ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలి

- రైతులకు అవసరమైన విత్తనాలు సమృద్ధిగా సిద్ధం
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, జూలై 16 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**
: ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించి, వ్యవసాయ శాఖ సూచనలను అనుసరిస్తూ సాగు పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో జిల్లాలో ఎల్‌నినో ప్రభావంపై వ్యవసాయ శాఖ చేపట్టిన అంచనాలు, ముందస్తు కార్యాచరణపై వివరాలు వెల్లడించారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం జిల్లాలోని 207 గ్రామాలు ఎల్‌నినో ప్రభావానికి మోస్తరు స్థాయిలో గురయ్యే అవకాశం ఉందని, తీవ్ర లేదా స్వల్ప ప్రభావం ఉన్న గ్రామాలు లేవని కలెక్టర్ తెలిపారు. జూలై 15 నాటికి జిల్లాలో 91,136 ఎకరాల్లో పంటల సాగు నమోదైందని చెప్పారు. ఇందులో 10,510 ఎకరాలు వర్షాధార పంటలు, 80,626 ఎకరాలు సాగునీటి ఆధారిత పంటలు కాగా, ఇంకా 1,84,671 ఎకరాల్లో సాగు చేపట్టాల్సి ఉందన్నారు. జూలై 16 నుంచి 31 వరకు 89,892 ఎకరాల్లో వివిధ పంటల సాగు లక్ష్యంగా వ్యవసాయ శాఖ కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఇందులో 84,500 ఎకరాల్లో వరి, 1,814 ఎకరాల్లో కందులు, 1,182 ఎకరాల్లో పెసలు, 186 ఎకరాల్లో మినుములు, 136 ఎకరాల్లో అలసందలు, 16 ఎకరాల్లో ఉలవలు, 8 ఎకరాల్లో ఆముదం, 925 ఎకరాల్లో మొక్కజొన్న, 3 ఎకరాల్లో పశుగ్రాస జొన్న, 471 ఎకరాల్లో కూరగాయలు, 651 ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సాగుకు అవసరమైన 17,259.03 క్వింటాళ్ల విత్తనాలకు గాను జిల్లాలో ఇప్పటికే 21,564.44 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు కలెక్టర్ తెలిపారు. రైతులకు ఎలాంటి విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామస్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని, తక్కువ వ్యవధిలో దిగుబడి ఇచ్చే ప్రత్యామ్నాయ పంటలు, వాతావరణానికి అనుకూలమైన సాగు విధానాలపై సాంకేతిక సూచనలు అందించాలని ఆదేశించారు. రైతులు వ్యవసాయ శాఖ సూచించే పంటల ఎంపిక, విత్తనాల వినియోగం, సాగు పద్ధతులను పాటిస్తూ సకాలంలో విత్తనాలు విత్తాలని, అవసరమైతే సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు.

## అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు అందించాలి



**మహబూబాబాద్, జులై 16 (తెలంగాణ వాణి)**
జిల్లాలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న అర్హులైన ప్రతి జర్నలిస్టులకు అక్రిడే షన్ కార్డులు,ఇండ్ల స్థలాలు అందించాలని టీయూడ బ్ల్యూజే హెచ్ 143- రాష్ట్ర ఉపాధ్యక్షులు బీఆర్ లెనిన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్లో గురువారం జిల్లా జర్నలిస్టుల సమన్వ య సమావేశం నిర్వహించా రు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు లెనిన్ హాజరై మాట్లాడుతూ గత బీఆర్ ఎస్ ప్రభుత్వ హాయంలో తమ యూనియన్ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 20 వేల జర్నలిస్టులకు అక్రిడేష న్ కార్డులు అందజేసింద న్నారు.ఈ ప్రభుత్వంలో ఉన్న జర్నలిస్టుల కమిటీ నాయకులు ప్రిట్,ఎలక్ట్రా నిక్ మీడియాలు పనిచేస్తు న్న జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు అరకొరకగా ఇస్తు ఇబ్బందులకు గురిచేస్తుంద న్నారు.జిల్లాలో సభ్యత్వ నమోదు పెంచాలని,జిల్లా కలెక్టర్,ఎస్పీ స్నేహ షబరిష్, హెలెమెంట్ ధరించాలని ప్రజలకు,ఉద్యోగస్తులకు అవగహన కల్పించారని, ప్రతి జర్నలిస్టు హెలెమెంట్ ధరించాలని వారి కుటుంబ ని కాపాడుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు తీగల కృష్ణరెడ్డి,రాష్ట్ర కమిటీ సభ్యులు ఈరగాని బిక్షం పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, జిల్లా కన్వీనర్ మద్దినేని గుట్టయ్య,కోకన్వీనర్ గాడిపెల్లి శేఖర్,నాయకులు కరుణకర్,ప్రసాద్,కిరణ్, వెంకన్న,శ్రీధర్,చక్రధర్, సుబ్రమణ్యం,శ్రీనివాస్, రాజేశ్వర్,వినోర్రెడ్డి,నారా యణరావు,సంతోష్,విష్ణు, మహేష్,గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## శాతవాహన విశ్వ విద్యాలయంలో పని చ్చేస్తున్న కొందరి పదోన్న తులు నిలిపి వేయాలి

- అడ్మినిస్ట్రేటివ్ పద వులు, ఇంక్రిమెంట్స్, పదోన్నతులను నిలిపి వేయాలి
- శాతవాహన విశ్వవిద్యా లయ రిజిస్ట్రార్ ప్రొ.సతీష్ కుమార్ కు వినతి పత్రం
- సామాజిక కార్యకర్తలు కోట శ్యామ్, కుమార్ బెల్లపు కరుణాకర్



**కరీంనగర్, జులై 16 (తెలంగాణ వాణి)**
శాతవాహన విశ్వవిద్యాల యంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఉపకులపతి ప్రొ.మల్లేష్ సంకసాల,మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.వరప్రసాద్, మాజీ కంట్రోలర్ డా.ఎన్వి శ్రీరంగప్రసాద్,సైన్స్ కళాశాల మాజీ ప్రిన్సిపల్ అరసాన్ జయంతి,మాజీ ఓ.ఎస్.డి డాక్టర్ వన్నాల రమేష్, మాజీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పీ.ప్రసాద్ తదితరులపై అనేక అవినీతి,అక్రమాల మీద ఆధారాలతో ప్రభుత్వా నికి ఫిర్యాదు చేయడం జరిగింది.దీనిపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించడం జరిగిందని మీ అందరికి తెలుసు.దీనిపై పూర్తి విచారణ అనంతరం తుది నివేదికను ప్రభుత్వాని కి అందజేయడం జరిగింది. విజిలెన్స్ తుది నివేదికపై ప్రభుత్వం చర్యలకు సిఫార సు చేస్తున్న సమయంలో విజిలెన్స్ విచారణ ఎదు ర్కొంటున్న ఇట్టి అవినీతి, అక్రమార్కులకు ఎలాంటి పదోన్నతులు,అడ్మినిస్ట్రేటి వ్ బాధ్యతలు,ఇంక్రిమెంట్లు ఇవ్వకూడదని తెలియజేస్తు న్నామని ఇలాంటి వ్యక్తుల వల్ల ప్రభుత్వ నిధులు అన్యాక్రాంతము,దుర్విని యోగం అవడం జరుగుతుం దని దీన్ని కట్టడి చేయాల్సిన బాధ్యత కనీస పౌరుడుగా మనందరికీ ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి,విజిలెన్స్ అండ్ ఇన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ జనరల్ కి ఇచ్చిన వినతి పత్రాలను వివిధ దినపత్రిక లలో వచ్చిన వార్త ప్రచరి తాలను కూడా జతచేసి ఇవ్వడం జరిగిందని ఒకవేళ ఇచ్చినట్లయితే తర్వాత ప్రభుత్వం తీసుకునే చర్యల కు,యూనివర్సిటీ లో జరిగే ఎలాంటి పరిణామాలకైనా వీసీ బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

## కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన నూతన డీఈవో చైతన్య జైనీ

**కరీంనగర్, జూలై 16 (తెలంగాణ వాణి)**



కరీంనగర్ జిల్లా విద్యాశాఖ అధికారిగా (డీఈవో) నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైతన్య జైనీ గురువారం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను ఆమె ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కలెక్టర్‌కు పూల బొకే అందించి శుభాకాం క్షలు తెలిపారు.జిల్లాలో విద్యా ప్రమాణాల మెరు గుదల,ప్రభుత్వ విద్యా కార్య క్రమాలుసమర్థవం తంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి డీఈవోగా విధులు నిర్వ హించిన విద్యాశాఖ అసిస్టెం ట్ డైరెక్టర్ ప్రశాంత్ రెడ్డి కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## మంత్రి ఆదేశాలతో పత్తిపాకలో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం

**ఉపాధి హామీ నిధులతో రూ.10 లక్షల అభివృద్ధి పనులు ప్రారంభం**
**ధర్మారం, జూలై 16 (తెలంగాణ వాణి):**
పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం పత్తిపాక గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టనున్న సిమెంట్ కాంక్రీట్ (సీసీ) రోడ్ల నిర్మాణ పనులను గురువారం స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. గ్రామంలోని 1వ నుంచి 3వ వార్డుల వరకు చేపట్టనున్న ఈ పనులకు భూమిపూజ నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ పనులను వేగవంతంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామానికి



రూ.10 లక్షల నిధులు మంజూరయ్యాయని, వాటితో నాణ్యమైన సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు.గ్రామాభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణంతో గ్రామంలోని అంతర్గత రహదారులు మెరుగుపడి, ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్ణీత గడువులో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాందాల శ్రావణి హరీష్, ఉపసర్పంచ్ పూసాల మల్లేష్, పంచాయతీ కార్యదర్శి తాళ్ల కిరణ్, వార్డు సభ్యులు గాజుల ముని, జోగుల లక్ష్మీ-కొమురయ్య, కర్ణ నరేష్, ఏదుల్ల అంజయ్య, కొమురయ్య, రేషవేణి మహేష్, జిల్లాల కాంతారాజు, మాజీ సర్పంచ్ నీలం నరసయ్య, కారోబార్ రవితో పాటు గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

## అయిలాపూర్ సబ్‌స్టేషన్ సామర్థ్యాన్ని పెంచాలని విద్యుత్ శాఖకు వినతి

**ఎస్ఈ బి. సుదర్శన్‌కు కాంగ్రెస్ నాయకుల విజ్ఞప్తి**
**కోరుట్ల రూరల్, జూలై 16 (తెలంగాణ వాణి):**
కోరుట్ల మండలంలోని అయిలాపూర్ గ్రామంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సామర్థ్యాన్ని 5 ఎంవీఏ నుంచి 8 ఎంవీఏకు పెంచాలని కాంగ్రెస్ నాయకులు జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) బి. సుదర్శన్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గ్రామంలో రోజురోజుకూ విద్యుత్ వినియోగం పెరుగుతున్నందున ప్రస్తుతం ఉన్న సబ్‌స్టేషన్ సామర్థ్యం సరిపోవడం లేదని, రైతులు, గృహ వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందని వివరించారు.వినతిపై స్పందించిన ఎస్ఈ బి. సుదర్శన్ త్వరలోనే అయిలాపూర్ సబ్‌స్టేషన్‌ను స్వయంగా పరిశీలించి, సామర్థ్యాన్ని 8 ఎంవీఏకు పెంచే అంశంపై అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ



కార్యక్రమంలో కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పన్నాల అంజిరెడ్డి, అయిలాపూర్ సర్పంచ్ ధ్యావనపెల్లి రామకృష్ణ, తిమ్మాయిపల్లె సర్పంచ్ పల్లపు అశోక్, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొంతం రాజం, సీనియర్ నాయకులు నగునూరి గంగాధర్ గౌడ్, మరుపాక సుమన్, సురుకంటి సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన

**నీటి కొరత నేపథ్యంలో వరి సాగు విస్తీర్ణం తగ్గించాలని**
**వ్యవసాయ శాఖ సూచన**

**పెద్దపల్లి, జూలై 16 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**
వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాల మట్టం తగ్గడం, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు ఆశించిన స్థాయిలో లేకపోవడం వంటి పరిస్థితుల దృష్ట్యా రైతులు వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.వాతావరణ శాఖ సమాచారం ప్రకారం రాబోయే రోజుల్లో వర్షాలు సాధారణ స్థాయిలో కురిసే అవకాశం లేదని, అలాగే భూగర్భ జలాల శాఖ నివేదిక ప్రకారం పెద్దపల్లి జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే భూగర్భ జలాల మట్టం సుమారు 1.5 మీటర్లు దిగజారినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా నీటిపారుదల శాఖ సమాచారం మేరకు ఎస్సారెస్పీ ప్రాజెక్టులో మొత్తం 60 టీఎంసీల సామర్థ్యానికి గాను ప్రస్తుతం కేవలం 15 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తూ, నీటి వినియోగం తక్కువగా ఉండే ప్రత్యామ్నాయ పంటలను



సాగు చేయాలని సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సతీష్, ఎస్సారెస్పీ ఏఈఈ రాజ్, ఏఈఓ శ్రీనివాస్, ఏఏఈ రమేష్, పాల్, ఏఈఓ యాస్మిన్, సర్పంచులు రాయదండి సాదుల స్వప్న, మద్దిర్యాల్ ముక్కెర రాజమొగిలి, ఇస్సంపేట దారవేణి సాయి, ఎల్లంపల్లి ఆరుముల్ల మాధవి, మురుమూర్ మగ్గిడి స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల రిజర్వేషన్లు పెంచిన ఘనత కేసీఆర్‌దే: దావ వసంత

**లోక్యా నాయక్, మంగత్య నాయక్ తండాల్లో సీత్లా**
**పండుగలో పాల్గొన్న మాజీ జడ్పీ చైర్‌పర్సన్**

**రాయికల్, జూలై 16 (తెలంగాణ వాణి):**
జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని లోక్యా నాయక్ తండా, మంగత్య నాయక్ తండాల్లో గురువారం నిర్వహించిన బంజారా సీత్లా పండుగ వేడుకల్లో జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత పాల్గొన్నారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజన లంబాడీలు తరతరాలుగా సాంప్రదాయబద్ధంగా జరుపుకునే తొలి పండుగ సీత్లా పండుగ అని తెలిపారు. సీత్లా భవాని, మారమ్మ భవాని, తుల్జా భవాని, హింగ్లా భవాని, కేంఖాలి భవాని, మంత్రాలి భవాని, ద్వాలంగర్ భవాని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మంచి వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు, పశువులు క్షేమంగా ఉండాలని ప్రార్థిస్తారని చెప్పారు.తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని దావ వసంత పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గిరిజనుల రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచామని, మళ్లీ కేసీఆర్ నాయకత్వంలోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యమవుతుందని



ఆమె వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మారంపెల్లి రాణిసాయి, సర్పంచ్ తిరుపతి నాయక్, మాజీ వైస్ ఎంపీపీ మహేశ్వర్ రావు, గిరిజన శక్తి జిల్లా నాయకుడు సంతోష్ నాయక్, శంకర్ నాయక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రమాపతి రావు, సంతోష్ రావు, రాజేందర్ గౌడ్, ప్రతాప్ రెడ్డి, సాగర్ రావు, గంగన్న, రాంప్రసాద్, సుధాకర్, భూక్యా రమేష్‌తో పాటు బంజారా నాయకులు, మహిళలు, యువత పాల్గొన్నారు.




## 11వ వార్డులో ఉచిత కంటి పరీక్షల శిబిరం

**హుస్నాబాద్, జూలై 16 (తెలంగాణ వాణి):**
హుస్నాబాద్ పట్టణంలోని 11వ వార్డులో కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో శరత్ మాక్స్ విజన్ సహకారంతో గురువారం ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో నేత్ర వైద్య నిపుణులు 56 మందికి కంటి పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలు అందించారు. శస్త్రచికిత్స అవసరమైన ఏడుగురికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ వరప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ, కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి కొమురయ్య, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ రవీందర్, పలువురు కౌన్సిలర్లు, మాక్స్ విజన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ రవికుమార్ నేతను సన్మానించిన పద్మశాలి సంఘం నాయకులు



**రాజపేట జులై: 16(తెలంగాణ వాణి విలేకరి)**
రాజపేట మండలం నూతన తహసిల్దారుగా గోలి రవికుమార్ పద్మశాలి ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా గురువారం రాజపేట వారి కార్యాలయంలో యాదాద్రి భువనగిరి జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు రఘునాథపురం మాజీ సర్పంచ్ గాడి పెల్లి శ్రవణ్ కుమార్ నేత , తెలంగాణ రాష్ట్ర పద్మశాలి యువజన సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ సామల భాస్కర్ నేత, వారిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది . ఈ సందర్భంగా వారిని చేనేత శాలువాలతో సత్కరించి యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి మహా ప్రసాదాన్ని అందజేసి శు భాకాంక్షలు తెలియజేశారు .ఈ సందర్భంగా తహసీల్దార్ రవికుమార్ నేత , పద్మశాలి జిల్లా, రాష్ట్ర నాయకులను అభినందించారు.

## విద్యుత్ ఘాతంతో పాడి బర్రె మృతి

**నష్టపరిహారం ఇవ్వాలని రైతు విజ్ఞప్తి**




**తిమ్మాపూర్, జూలై 16 (తెలంగాణ వాణి):**
తిమ్మాపూర్ మండలం పోరండ్ల గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ ఘాతానికి గురై ఓ పాడి బర్రె మృతి చెందింది. బాధిత రైతు చింతల రమణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పొలంలో గడ్డి మేస్తున్న బర్రె తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కారణంగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే చనిపోయింది. దాదాపు రూ.లక్ష విలువైన పాడి బర్రె మృతి చెందడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని, ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు పెంచాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతు ఆరోపించారు. తనకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## సర్పంచ్ అక్రమాలపై అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు



**సంగారెడ్డి : కల్హేర్, జులై 16 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
కల్హేర్ మండల పరిధిలోని బిబిపేట్ గ్రామ సర్పంచ్ బండారి సంతోష ఆమె భర్త బండారి సాయిలు, సమంతర పాలన ఏకపక్ష నిర్ణయాలు నిధులు దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, పాలకవర్గ సభ్యులు జిల్లా అదనపు కలె క్టర్ ఆర్, పాండును కలిసి వినతి పత్రం అందజేశారు, ఈ ఘటనపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు, ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## వర్షాలు కురవాలని పోచమ్మ తల్లికి ఘనంగా బోనాలు

**గాగిరెడ్డిపల్లెలో అన్ని కులాల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు**



**చిగురుమామిడి, జూలై 16 (తెలంగాణ వాణి)**
: కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లె గ్రామంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ గురువారం పోచమ్మ తల్లికి బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అన్ని కులాల ప్రజలు ప్రతి ఇంటి నుంచి బోనాలు తీసుకువచ్చి, డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, బైండ్ల నృత్యాల నడుమ పోచమ్మ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. అనంతరం బైండ్ల పూజారులు పోచమ్మ తల్లి చరిత్రను వివరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సన్నీళ్ల కవిత వెంకటేష్ మాట్లాడుతూ, కులాలకు అతీతంగా గ్రామ ఐక్యతకు ప్రతీకగా బోనాల వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వడ్లకొండ నరేందర్ రెడ్డి, మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యువత భవిష్యత్తు కోసం గంజాయి పై పోలీసుల ఉక్కుపాదం

కారేపల్లి : యువత భవిష్యత్తును మత్తుపదార్థాల బారిన పడకుండా కాపాడాలనే లక్ష్యంతో కారేపల్లి పోలీసులు గంజాయి అక్రమ విక్రయాల పై ఉక్కుపాదం మోపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు గురువారం కారేపల్లి ఎస్సై బైరు గోపి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. కారేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పాన్‌షాపులు, కిరాణా దుకాణాలు, అనుమానాస్పద వ్యాపార కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకుని గంజాయిని చాక్లెట్లు, సిగరెట్లు, పౌడర్ రూపాల్లో విక్రయిస్తున్నారనే సమాచారంతో పోలీసులు అప్రమత్తమై విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. గంజాయి హాట్‌స్పాట్‌లుగా గుర్తించిన ప్రాంతాల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## పంచాయతీ ట్యాంకర్ తో నారుమడికి నీటి సరఫరా



**శంకరపట్నం:జూన్ 16 (తెలంగాణ వాణి)**
గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్‌ను అధికార దుర్వినియోగంతో వ్యక్తిగత వ్యవసాయ అవసరాలకు వినియోగి స్తున్నారనే ఆరోపణలు రాజాపూర్ గ్రామంలో చర్చ నీయాంశంగా మారాయి. కరీంనగర్ జిల్లా శంకరప ట్నం మండలంలోని రాజా పూర్ గ్రామ సర్పంచ్ తన సొంత వ్యవసాయ నారు మడికి పంచాయతీ ట్రాక్టర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.ప్రభుత్వ నిధులతో కొనుగోలు చేసిన పంచాయతీ వాహనాలు గ్రామ ప్రజల అవసరాల కోసం మాత్రమే వినియోగిం చాల్సి ఉండగా,వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగి స్తే అది అధికార దుర్విని యోగంగా పరిగణించే అవకాశం ఉందని గ్రామ స్థులు అభిప్రాయపడు తున్నారు.ఎల్ నినో ప్రభా వంతో ఈసారి వానాకాలం పంటలకు వర్షాలు ముఖం చాటేయడంతో వర్షాభావ పరిస్థితి ఏర్పడిన నేపథ్యం లో గ్రామంలోని రైతులందరి పరిస్థితి ఇలాగే నెలకొంది. అయితే గ్రామ సర్పంచ్ తనకు మాదిరిగానే ఎండుతున్న అందరి వరి నారుమళ్ళకు కూడా నీటి సరఫరా చేస్తారా అని ప్రశ్నిస్తున్నారు.ఈ ఘటనపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి,వాస్తవాలు వెలుగులోకి తీసుకురావా లని,ప్రభుత్వ ఆస్తులను వ్యక్తిగత అవసరాలకు ఉపయోగిస్తున్న ఆయనపై తగిన చర్యలు తీసుకోవాల ని గ్రామస్థులు కోరుతు న్నారు.

## సిరిసిల్ల రెస్టారెంట్‌లో ఫుడ్ పాయిజన్ కలకలం....



**రాజన్న సిరిసిల్ల,జూలై 16 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి) :**



రాజన్న సిరిసిల్ల జిల్లాలో మరోసారి ఫుడ్ పాయిజన్ ఘటన కలకలం రేపింది. సిరిసిల్ల పట్టణంలోని బకాసుర రెస్టారెంట్‌లో మండి బిర్యానీ తిన్న నలుగురు యువకులు కొద్దిసేపటికే వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు.బాధితుల్లో ఒకరి పరిస్థితి విషమించడంతో వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మిగిలిన ముగ్గురు సమీపంలోని ఆర్ఎంపీ వద్ద ప్రాథమిక చికిత్స పొందారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.కలుషిత ఆహారం తీసుకోవడం వల్లే ఫుడ్ పాయిజన్ జరిగినట్లు వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించినట్లు సమాచారం. ఘటనపై సంబంధిత అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.ఇటీవల రాజన్న సిరిసిల్ల జిల్లాలో వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటుచేసుకుంటుండటంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలను ఫుడ్ సేఫ్టీ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేసి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## కూలీలు ప్యాసింజర్ వాహనాలలో వెళ్లడమే సురక్షితం....

- గూడ్స్ వాహనాలలో కూలీలను తీసుకువెళ్తే కఠిన చర్యలు తప్పవు
- సిరిసిల్ల మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ వంశీధర్



**రాజన్న సిరిసిల్ల,జూలై 16 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి) :**
గూడ్స్ వాహనాలలో కూలీలను తీసుకువెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిరిసిల్ల మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ వంశీధర్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వెంకట్రావుపల్లి వద్ద వాహనాల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.ఈ సందర్భంగా గూడ్స్ వాహనాలలో కూలీలను తీసుకువెళ్తున్న మూడు వాహనాలు సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వెహికల్ ఇన్స్పెక్టర్ వంశీధర్ స్వయంగా పొలాల్లో నాట్లు వేస్తున్న కూలీల వద్దకు వెళ్లి, గూడ్స్ వాహనాలలో వెళ్ళవద్దని, వెళితే జరిగే నష్టాల గురించి వివరించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వంశీధర్ మాట్లాడుతూ కూలీలను గూడ్స్ వాహనాలలో తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కూలీలు కూడా గూడ్స్ వాహనాలు కాకుండా ప్యాసింజర్ వాహనాలలో వెళ్లాలని, అప్పుడే సురక్షితంగా గమ్యస్థానాలు చేరుకుంటారని తెలిపారు.

## రిపోర్టర్ శాంసన్ రాజు తండ్రి ఆనందరావు కన్నుమూత

- పార్థివ దేహానికి నివాళులర్పించిన టియుడబ్ల్యూజే, ఐజేయు నేతలు
- బాధిత కుటుంబానికి యూనియన్ అండగా ఉంటుందని హామీ



**చుంచుపల్లి, జూలై 16 (తెలంగాణ వాణి)**
సీనియర్ రిపోర్టర్ నక్క శాంసన్ రాజు తండ్రి నక్క ఆనందరావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందారు. టియుడబ్ల్యూజే - ఐజేయు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు జె. వెంకటరత్నం, జిల్లా కార్యదర్శి జునుమాల రమేష్ ఆనందరావు పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం రిపోర్టర్ శాంసన్ రాజు, కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వెంకటరత్నం మాట్లాడుతూ శాంసన్ కుటుంబానికి యూనియన్ అండగా ఉంటుందని, తక్షణ సహాయంగా రూ.10 వేలు అందజేసి యూనియన్ సభ్యులందరూ శాంసన్‌కు తోడుగా ఉంటారని హామీ ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో జిల్లా ఉపాధ్యక్షులు బాదావత్ శంకర్, నాయకులు రాజేష్, ప్రతాప్, జాన్సన్ డేవిడ్(బాబు), సురేష్, హరి, మురళి, క్రాంతి, రాము, కుమార్, భాష్యం నాని, సూరి, అల్లెపు శంకర్ తదితర జర్నలిస్టులు, ఐజేయు నాయకులు ఉన్నారు.

# రేవంత్ రెడ్డిది ప్రజా పాలన కాదు.. రాక్షస పాలన

- రైతులను ఎదుర్కొనే దమ్ము లేదా?
- మాజీ ఎమ్మెల్యే మెచ్చా హౌస్ అరెస్ట్

**అశ్వరావుపేట ఆర్సి జూలై 16 (తెలంగాణ వాణి)**
రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తారన్న భయంతో భద్రాద్రి కొత్తగూడెంజిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు రేగా కాంతారావు పిలుపు మేరకు నిరసనకు సిద్ధమైన అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేసి పోలిస్ స్టేషన్లకు తరలించగా అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు ని దమ్మపేట (మండలం) తాటిసు బ్బన్నగూడెం (గ్రామం) లోని వారి నివాసంలో హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ పిరికిపంద చర్యేని ఉప ముఖ్యమంత్రితో సహా మంత్రుల దండు మణుగూరు వస్తుంటే, రైతుల సమస్యలపై ప్రశ్నిస్తారనే వణుకు ఎందుకు పట్టుకుందని ప్రశ్నించారు అధికారంలోకి రాకముందు ఆకాశం నుంచి అమృతం తెస్తామన్న కాంగ్రెస్ నాయకులు తీరా గద్దెనెక్కాక రైతుల కష్టాలు అడిగితే పోలీసులతో అరెస్టులు చేయిస్తారా? అంటూ విరుచుకుపడ్డారు. ఓట్లు వేసిన పాపానికి ప్రజలకు మీరు ఇస్తున్న బహుమతి జైలు శిక్షలా?ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం రాజ్యాంగం ఇచ్చిన హక్కు కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాజ్యాంగంపై కంటే లాఠీలపైనే నమ్మకం ఎక్కువైనట్లుందని పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రభుత్వాన్ని పాలించడానికి నువ్వు ముఖ్యమంత్రివా? లేక నియంతవా రేవంత్ రెడ్డి? అంటూ ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయమని అడగడం తప్పైతే.. ఆ తప్పును బీఆర్ఎస్ పార్టీ చేస్తూనే ఉంటుందని కేసులు పెట్టి, అక్రమ అరెస్టులు చేసి తెలంగాణ ఉద్యమకారుల గొంతు నొక్కొచ్చు అనుకోవడం రేవంత్ రెడ్డి మూర్ఖత్వమని మీ చేతకాని పాలనను కప్పిపుచ్చుకోవడానికే ఈ దిక్కుమాలిన చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఎన్ని అరెస్టులు చేసిన ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటామని రానున్న 2 సంలో మళ్ళీ తిరిగి అధికారం లోకి వచ్చాక ప్రతి ఒకరికి సమాధానం కూడా ఇస్తామని ఇలాంటి నీచ రాజకీయాలు మానుకోవాలని హెచ్చరించారు.



# విద్యార్థుల యూడైస్ నమోదు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలి

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు.**

**నిర్మల్, జూలై 16 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి గురువారం రాత్రి హైదరాబాదులోని రాష్ట్ర సచివాలయం నుంచి విద్య, వ్యవసాయ, వైద్యారోగ్య తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, పాఠశాలల్లో విద్యార్థుల యూడైస్ నమోదు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని చెప్పారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. కేంద్రీకృత ఆహారశాల ఏర్పాటు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. యూనిఫాంల ను త్వరితగతిన సిద్ధం చేసి విద్యార్థులకు అందించాలని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. జిల్లాల వారిగా వర్షపాతం,




పంటల సాగు, ఎరువులు, విత్తనాల లభ్యతను సమీక్షించారు. అన్ని జిల్లాల్లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందించాలని వివరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. పంట మార్పిడి విధానాలు, ఆయిల్ పామ్, కూరగాయల పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహించాలని అన్నారు. ప్రాజెక్టుల్లో నీటి మట్టం వివరాలు సమీక్షించారు. కాలానుగుణ వ్యాధులు వ్యాపించకుండా తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మెరుగైన పారిశుద్ధ్య పనులు నిరంతరం కొనసాగించాలన్నారు. అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో అవసరమైన వైద్యసేవలు అందించాలని తెలిపారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఈ వీసీలో కలెక్టర్ భవేశ్ మిశ్రా, అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డీఈవో భోజన్న, డిపివో శ్రీనివాస్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, డిఎంహెచ్ఓ రాజేందర్, ఈఈ ఆర్డబ్ల్యూఎస్ సందీప్, సిపిఓ గంగారెడ్డి, హార్టికల్చర్ అధికారి రమణ, ఇంటర్మీడియట్ విద్యాధికారి పరుశురాం, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్లు అధికారంలో ఉండి జిల్లాకు ఏం చేశావు.

- కేసీఆర్ కు దత్తపుత్రుడిగా కమిషన్ లు దండుకున్న చరిత్ర నీది.
- వేముల ప్రశాంత్ రెడ్డి పై మండిపడ్డ డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి.

**నిజామాబాద్ జులై 16 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
కేసీఆర్ దత్తపుత్రుడిగా, పదేళ్లు అధికారంలో ఉండి జిల్లాకు ఒరగబెట్టింది ఏమీ లేదని మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పై జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. కేవలం తమ ఉనికిని కాపాడుకోవడానికే దొంగ దీక్షలు చేపడుతున్నారని ఆరోపించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ సారథ్యంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు ను చూసి ఓర్వలేకనే ప్రశాంత్ రెడ్డి అవాకులు చవాకులు పేలుస్తున్నారని నగేష్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి అక్రమాలలో కేసీఆర్ దత్తపుత్రుడిగా ప్రశాంత్ రెడ్డికి వాటా ఉందని ఆరోపించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన మీ పార్టీని ప్రజలు ఎప్పుడో




మర్చిపోయారని ఆయన అన్నారు. పదేళ్లు మీ పార్టీ అధికారంలో ఉండి జిల్లాను ఎందుకు అభివృద్ధి చేయలేదని, అధికారాన్ని అడ్డం పెట్టుకొని అడ్డగోలుగా దోచుకున్నారని విమర్శించారు. కోట్లాది రూపాయలతో జరుగుతున్న భీంగల్ అభివృద్ధి మీకు కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. అధికారంలో ఉండి కూడా భీంగల్ అభివృద్ధి నీ ఎందుకు విస్మరించారని ఆయన ప్రశ్నించారు. డాక్టర్ల సలహా మేరకే నిరాహార దీక్ష చేపట్టారని, ప్రజలను మభ్యపెట్టడానికి ప్రశాంత్ రెడ్డి చేస్తున్న నాటకాలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అమలు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఓటరు సవరణ ప్రక్రియలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పనిచేస్తున్నారని ఆయన అన్నారు. సుదర్శన్ రెడ్డి గతంలో మంత్రిగా ఉన్నప్పుడు ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిధులు కేటాయిస్తే, టిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు పూర్తి వివక్షతకు గురి చేశారని ఆరోపించారు. కమిషన్లు దండుకునే దానిపై ఉన్న శ్రద్ధ ప్రజలకు, రైతులకు ప్రయోజనం చేకూర్చే పనులు చేయలేదని అన్నారు. రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గాల విభజన లో భాగంగా కాంగ్రెస్ పార్టీ 120 స్థానాలు సాధించడం ఖాయమన్నారు. భారతీయ జనతా పార్టీతో బీఆర్ఎస్ కు లోపాయికార ఒప్పందం ఉందని ఆయన ఆరోపించారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు భక్తవత్సలశీ, రత్నాకర్ గౌడ్, జావిద్ అక్రమ్, విపుల్ గౌడ్, రాజు, నరేందర్ గౌడ్, గోపి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు ఎమ్మెల్యే వినతి



**ఎల్లారెడ్డి, జూలై 16 (తెలంగాణ వాణి)**
నియోజకవర్గ సమస్యలపై కలెక్టర్ ఆశిష్ సంఘ్వాన్ ను ప్రత్యేకంగా కలిసిన ఎల్లారెడ్డి నియోజకవర్గం ఎమ్మెల్యే మదన్మోహన్రావు . ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలకు సంబంధించిన అత్యవసర సమస్యలపై జిల్లా కలెక్టర్కు ఎమ్మెల్యే మదన్మోహన్రావు వినతి పత్రాన్ని సమర్పించారు. రైతులు గిరిజనులు గ్రామపంచాయతీ తాగునీరు మౌలిక వసతుల వంటి ప్రజలకు కావలసిన అవసరాల అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు . వినతి పత్రంలో భాగంగా నాగిరెడ్డిపేట మండలం పోచారం గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 268 మాల్తుం మీద గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 834 ,838 నంబర్లలో గల భూములకు సంబంధించిన యజమానులకు ఇప్పటివరకు ఎలాంటి పట్టా పాస్ పుస్తకాలు అందలేదని, పెండింగ్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించి రైతులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు . అలాగే నియోజకవర్గంలోని గండిపేట వెంకటాపూర్ తండా తో పాటు పలు గిరిజన గ్రామాలలో ఇందిరమ్మ ఉన్న నిర్మాణాలకు అటవీ శాఖ అధికారులు అటవీ భూముల పేరుతో అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు . సంబంధిత భూములపై సమగ్ర పరిశీలన చేపట్టి అర్హులైన లబ్ధిదారులకు భూములను కేటాయించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు మార్గ నిర్దేశం చేయాలని కోరారు . వ్యవసాయ ఉత్పత్తుల ఎన్నో సౌకర్యాలు మెరుగుపరచండి ప్రతి మండల కేంద్రంలో 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించి గోదాముల నిర్మాణం అవకాశం కల్పించాలని అలాగే నాగిరెడ్డిపేట మండలంలో సమీకృత మండల కార్యాలయం సముదాయం నిర్మాణం కోసం 20 ఎకరాల ప్రభుత్వ భూమి అలాగే మినీ స్టేడియం నిర్మాణం కోసం 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని కలెక్టర్ దృష్టికి ఎమ్మెల్యే మదన్మోహన్రావు తీసుకున్నారు .వర్షాభావ పరిస్థితుల్లో నియోజకవర్గంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో తాగునీటి నిర్వహణ చేపట్టాలని ,నాగిరెడ్డి పేట మండలంలోని బొల్లారం గ్రామంలోని రాముతాండా నుండి లింగోజిపల్లి పోచమ్మ ఆలయం వరకు మెటల్ రోడ్డు నిర్మాణానికి పెండింగ్లో ఉన్న అటవీ శాఖ అనుమతులను తొందరగా పూర్తిచేసి మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే సమర్పించడం ప్రతి అంశాన్ని జిల్లా కలెక్టర్ ఆసీస్ సంఘ్వన్ సానుకూలంగా స్పందించి పరిశీలిస్తామని తెలిపారన్నారు . సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి అవసరమైన చర్యలను వెంటనే పరిష్కరించి ప్రారంభించేలా ప్రతిరోజూ లేని సమస్యలను పరిష్కరించి చర్యలు తీసుకురా కలెక్టర్ తెలిపారని నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్మోహన్రావు అన్నారు .

## అంగన్వాడీ అక్రమ బదిలీలు, పదోన్నతులు రద్దు చేయాలి

**ఏటూరునాగారం, జూలై 16 (తెలంగాణ వాణి):**
ములుగు జిల్లా మానసపల్లి, పాప్కాపురం అంగన్వాడీ కేంద్రాల్లో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన బదిలీలు, పదోన్నతులను వెంటనే రద్దు చేసి, అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సామాజిక న్యాయవేదిక జిల్లా అధ్యక్షుడు గంపల శివకుమార్ డిమాండ్ చేశారు. గురువారం గ్రామస్తులు, గర్భిణీలు, బాలింతలతో కలిసి మానసపల్లి అంగన్వాడీ కేంద్రం వద్ద నిరసన చేపట్టిన ఆయన, కేంద్రాల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందాల్సిన సేవలు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. ఖాళీలను పారదర్శకంగా భర్తీ చేసి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. డిమాండ్లు నెరవేర్చకపోతే దశలవారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు




## అసిస్టెంట్ ప్రొఫెసర్కు మున్సిపల్ పరిధిలో ఘన సన్మానం



**ఎల్లారెడ్డి నియోజకవర్గ జూలై 16:( తెలంగాణ వాణి ప్రతినిధి)**
కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మిత్రులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ వడ్ల శంకర్ మున్సిపల్ పరిధిలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు . కష్టాలు కడలిని దాటుకొని విజయ తీరం వైపు ఎగిసిన వ్యక్తి అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రొద్యూల శంకర్ . దారి కనపడని దారి వేసుకొని ముందుకు ప్రయాణం చేసుకొని ప్రగతి పథంలో నడిపి వ్యవసాయ కూలిగా వడ్రంగి పనిచేసుకుంటూ రంగుల రాత్నంగా, ఒడిదుడుకులతో , ఓర్పుతో కాలేదా కళాశాల అభ్యర్థులను సమాజ సేవకుడుగా విజయ తీరాలు చేరుతున్న సత్కరి శంకర్ . కామారెడ్డి హృదయంలో ఉప్పు ఉంటుంది తెలంగాణ డాక్టర్ నందిని సిద్ధారెడ్డి అన్నారు. ప్రత్యేకతలు తొలి అధ్యక్షుడు తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీలో పాల్గొన్నారు . ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ వైస్ ప్రిన్సిపల్ చంద్రకాంత్ ఆకుల హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు .

## ఐ కె పి సిసిలు బదిలీ

**నాగిరెడ్డిపేట మండలం జూలై 16:( తెలంగాణ వాణి ప్రతినిధి)**
నాగిరెడ్డిపేట మండలంలోని వైకెపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఐకెపి సీసీలు బదిలీపై వెళ్లారు . బదిలీపై వెళ్లిన సీసీలు 19 మాల్తుమ్మెద నారాయణ , జలాల్పూర్ అబ్దుల్ రషీద్ , గోపాల్పేట రమేష్ . ఐకెపిసిసిలు బదిలీ అయినట్లు ఐకెపి ఇన్చార్జ్ ఏపిఎం కొమ్మ దత్తు తెలిపారు . మండలంలోని శ్రీనిధి డబ్బుల రికవరీలో పూర్తిగా వెనుక పడటంతో ప్రత్యేక చర్య తీసుకుని జిల్లా అధికారులు బదిలీ చేసినట్లు తెలిపారు . బదిలీ స్థానాల్లో ఇప్పటికి ఇంకా ఎవరిని నియమించలేదని తెలిపారు .

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com